ఎవరినీ బాధ పెట్టాలనే ఉద్దేశం

## నాకు లేదు : రోహిత్



07


# మానేరు జనత ®

తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

12.03.2025 బుధవారం Wednesday | సంపుటి (Volume): 09 సంచిక (Issue) : 328 | పేజీలు : 8 Pages : 8 | Published from : Karimnagar


సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ఔత్సాహికులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

# నేను వస్తున్నా సిద్ధం కండి

## అసెంబ్లీలో సమస్యలపై పోరాడుదాం

- ప్రభుత్వ తీరును సహేతుకంగా ఎండగడదాం
- బీఆర్ఎస్ఎల్పీలో సమావేశంలో కేసీఆర్ కీలక ఆదేశాలు

జనతా న్యూస్: తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ నేడు అసెంబ్లీలోకి అడుగు పెట్టనున్నారు. బుధవారం నుంచి ప్రారంభం కానున్న తెలంగాణ బడ్జెట్ సమావేశాలకు కేసీఆర్ హాజరు కానున్నారు. మంగళవారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 'నేనూ వస్తున్నా.. మీరంతా రావాలి.. సమస్యలపై పోరాడుదాం'.. అని సూచించారు. ముఖ్యంగా బీఆర్ఎస్ శాసనసభ, మండలి సభ్యులందరూ నిర్ణీత సమయానికి హాజరు కావాలని, తెలంగాణ ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలని కేసీఆర్ పిలుపునిచ్చారు.

..3లో





03

# కొండపర్తి బ్రాండ్ కనిపించాలి

దత్తత గ్రామంలో మంత్రి సీతక్కతో కలసి పర్యటన గిరిజనుల ఇంగ్లీష్ ప్రావీణ్యంపై ఆశ్చర్యం కొండపర్తిలో పర్యటించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

తాను దత్తత తీసుకున్న ములుగు జిల్లా కొండపర్తి గ్రామానికి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ రోడ్డు మార్గాన చేరుకున్నారు. మంత్రి సీతక్క ప్రిన్సిపల్ సెక్రెటరీ కిషోర్, కలెక్టర్ దివాకర, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా ఘన స్వాగతం పలికారు. ఆదివాసీలు వారి నృత్యాలతో ఆకట్టుకున్నారు. కుమురం భీమ్, బిర్సా ముండా విగ్రహాలకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, మంత్రి సీతక్క ఆవిష్కరించారు.

## గ్రూప్-2 పరీక్షా ఫలితాలు విడుదల

02





## రెండు నెలల్లో ట్రిపుల్ ఆర్‌కు అనుమతులు

- కేంద్రమంత్రి గడ్కరీ హామీ ఇచ్చారు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

03



03

### శ్రీచైతన్య కాలేజీల్లో 5 కోట్లు స్వాధీనం

రెండోరోజూ ఐటీ అధికారుల సోదాలు




### విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

03

విద్యార్థి మృతి.. నలుగురుకి గాయాలు

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కొనసాగుతున్న ఆపరేషన్

రోబోలను రంగంలోకి దింపిన అధికారులు



03



02

### గద్దర్ అవార్డులపై కీలక ప్రకటన

13 నుంచి దరఖాస్తుల స్వీకరిస్తామిన వెల్లడి

## అమెరికా స్టాక్ మార్కెట్లలో భారీ కుదుపు

02



దాదాపు రూ.349 లక్షల కోట్లు మేరకు ఆవిరి

ఆర్థిక వ్యవస్థ పటిష్టంగానే ఉందని వైట్‌హౌజ్ ప్రకటన





# నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు


- ఉదయం 11 గంటలకు గవర్నర్ ప్రసంగం
- అసెంబ్లీ వద్ద మూడంచెల భద్రతా ఏర్పాట్లు
- ప్రభుత్వాన్ని నిలదీసేలా బిఆర్ఎస్ సన్నద్ధం

తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే సమావేశాల నిర్వహణపై స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసన సభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబుతో చర్చించారు. సమావేశాల నిర్వహణకు ఏర్పాట్లు కూడా చేశారు. ఉదయం 11 గంటలకు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించడంతో సమావేశాలు ప్రారంభం అవుతాయి. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ప్రభుత్వం పలు కీలక అంశాలపై చర్చించనుంది. ఎస్సీ వర్గీకరణ, బీసీ కుల గణన, బీసీ రిజర్వేషన్ల గురించి సభలో చర్చించనున్నారు. ఇప్పటికే ఆయా బిల్లులకు మంత్రివర్గం ఆమోదం తెలపడంతో సభలో ప్రవేశ పెట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నెల 27 వరకు సమావేశాలు కొనసాగనున్నాయి.

02

# గద్దర్ అవార్డులపై కీలక ప్రకటన

**13 నుంచి దరఖాస్తులు**



**హైదరాబాద్, మార్చి 11 :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక 'గద్దర్ అవార్డ్స్'ను ఈ ఏడాది ఉగాది నుంచి ప్రారంభించనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ఎంట్రీలను ఆహ్వానించింది. అయితే అనుకోని కారణాల వలన ఈ వేడుక ఉగాది నుంచి ఏప్రిల్ మొదటివారంలో నిర్వహించబోతున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తాజాగా స్పష్టత ఇచ్చింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సంవత్సరం (2014) నుంచి 2013 వరకు ఒక్కో సినిమాకు ఉత్తమ చలన చిత్రం అవార్డును ఇవ్వబోతున్నట్లు తాజాగా ప్రకటించింది. ఈ అవార్డుల విధివిధానాలను ఇటీవల ఖరారు చేసిన ప్రభుత్వం, మార్చి 13 నుంచి దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించనున్నట్లు వెల్లడించింది. వేడుకలలో సినిమా నటులతో పాటు దర్శకులు, సాంకేతిక నిపుణులతో పాటు ఐక్యతను పెంపొందించే సాంస్కృతిక విద్యా, సామాజిక ఔచిత్యం, జాతీయ సమైక్యతను ప్రోత్సహించే చిత్రాలు, బాలల సినిమాలు, పర్యావరణం, హెరిటేజ్, చరిత్ర ఆధారిత చిత్రాల విభాగాల్లో ప్రభుత్వం పురస్కారాలు ఇవ్వనుంది. ఇవే కాకుండా తొలి ఫీచర్ ఫిల్మ్, యానిమేషన్ ఫిల్మ్, డాక్యుమెంటరీ, షార్ట్ ఫిల్మ్ వంటి విభాగాల్లోనూ ఈ అవార్డులను ప్రదానం చేయాలని భావిస్తోంది. తెలుగు సినిమాపై పుస్తకాలు, విశ్లేషణలు రాసిన వారికి, నటీనటులు, సాంకేతిక నిపుణులకు కూడా ఈ గౌరవాన్ని అందించనున్నారు. అలాగే తెలంగాణ సినిమా రంగంలో అసాధారణ సేవలు అందించిన పైడి జయరాజ్, కాంతారావు పేర్లతో కూడా ప్రత్యేక పురస్కారాలను అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తుంది.తెలుగు సినీ పరిశ్రమను ప్రోత్సహించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డులను ఇవ్వనున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. తెలుగు సినిమాపై పుస్తకాలు, విశ్లేషణాత్మక వ్యాసాలు, నటీనటులు, సాంకేతిక నిపుణులకూ ఈ అవార్డును ఇవ్వనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. పైడి జయరాజ్, కాంతారావు, ఎం.ప్రభాకర్‌రెడ్డి పేర్లతో అవార్డులు కొనసాగించాలని నిర్ణయించింది.

# ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితాపై ఈసీ స్పందన

**సమస్యలు తెలియచేయాలని పార్టీలకు సూచన**

**న్యూఢిల్లీ, మార్చి 11 :** దేశవ్యాప్తంగా జరిగే ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితాపై ప్రతిపక్షాలు కొంతకాలంగా పలు సందేహాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలోనే ఈసీ దిద్దుబాటు చర్యలకు దిగింది. పార్లమెంట్‌లో కూడా సోమవారం విపక్షాలు చర్చకు పట్టుబట్టాయి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ప్రతిపక్షాలు దేశవ్యాప్తంగా ఓటర్ జాబితా, గుర్తింపు కార్డుల అంశంపై ప్రశ్నలు లేవనెత్తాయి. దీనిపై చర్చ జరపాలని డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించి.. ఎన్నికల పక్రియను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. దీనికి సహకరించాలంటూ రాజకీయ పార్టీలకు పిలుపునిచ్చింది. ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులు, చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ల స్థాయిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని అన్ని జాతీయ, రాష్ట్ర పార్టీలకు ఈసీ సూచించింది. ఏప్రిల్ 30 నాటికి సలహాలను అందించాలని కోరింది. అందుకు సంబంధించి రాజకీయ పార్టీలకు సూచనలిచ్చింది. ఎన్నికల పక్రియను మరింతగా బలోపేతం చేసేందుకు ఆయా పార్టీల అధ్యక్షుడు, సీనియన్ నేతలతో చర్చలు జరిపేందుకు యోచిస్తున్నట్లు ఓ ప్రకటనలో వెల్లడించింది. పార్టీల సీనియర్ నేతలు అందించే కీలక సూచనలను స్వీకరించనున్నట్లు తెలిపింది. పార్టీలతో సీఈవో, డీఈవో, ఈఆర్‌వోలు సమావేశం కావాలని.. ఆ సమయంలో వారు అందించే సమస్యలు, కీలక సూచనలను స్వీకరించి దానిపై నివేదిక ఏర్పాటు చేసి కమిషన్‌కు సమర్పించాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. కాగా.. వివిధ రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతుండడంతో ఈసీ స్పందించింది. ఆయా స్థాయిలో పరిష్కృతంగా ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని తాజాగా కోరింది.

# గ్రూప్-2 పరీక్షా ఫలితాలు విడుదల

**హైదరాబాద్, మార్చి 11 :** ప్రభుత్వ శాఖల్లోని ఖాళీల భర్తీకి నిర్వహించిన గ్రూప్-2 పరీక్ష ఫలితాలు మంగళవారం సాయంత్రం విడుదలయ్యాయి. జనరల్ ర్యాంకింగ్ లిస్టును టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. 783 పోస్టుల భర్తీకి 2022లో గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదలకాగా, 5 లక్షలకుపైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈ పరీక్షలకు 46 శాతం మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. అంటే సగానికి సగం మంది మాత్రమే గ్రూప్-2 పరీక్షలను రాశారు. 2024 డిసెంబర్ 15, 16న పరీక్షలు నిర్వహించారు.

# కాశ్మీర్‌లో రెండు తీవ్రవాద సంస్థలపై నిషేధం

**ఉత్తర్వులు జారీచేసిన కేంద్రహోంశాఖ**

**న్యూఢిల్లీ,మార్చి11 :** జమ్మూ కశ్మీర్ కేంద్రంగా పనిచేస్తున్న రెండు సంస్థలపై కేంద్ర హోంశాఖ కొరడా ఝుళిపించింది. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున ఆ రెండు సంస్థలపై ఐదేళ్ల పాటు నిషేధం విధిస్తున్నట్టు వేర్వేరు ప్రకటనల్లో తెలిపింది. అవామీ యాక్షన్ కమిటీ , జమ్మూకశ్మీర్ ఇత్తిహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎం) సంస్థలను చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద నిషేధిత సంస్థలుగా ప్రకటిస్తున్నట్టు పేర్కొంది. అవామీ యాక్షన్ కమిటీకి ఉమర్ ఫరూక్ సారథ్యం వహిస్తుండగా, జేకేఐఎంకు మసూర్ అబ్బాస్ సారథ్యం వహిస్తున్నారు. ఏఏసీ, జేకేఐఎంలు జమ్మూకశ్మీర్‌లో వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తూ భారత వ్యతిరేక ప్రచారం సాగిస్తున్నాయని ఎంహెచ్‌ఏ అధికారిక ప్రకటనలో పేర్కొంది. సాయుధ చొరబాట్లు, అంశాంతి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా అశాంతి రెచ్చగొడుతున్నట్టు తెలిపింది. జాతి వ్యతిరేక ప్రసంగాల చేయడం, హింసను ప్రేరేపించడం, రాళ్లు రువ్వడం వంటి ఘనటనల్లో ఉమర్ ఫరూక్, ఇతర సభ్యుల ప్రేమయంపై అనేక కేసులు నమోదుకావడాన్ని ప్రస్తావించింది. మసూర్ అబ్బాస్ నేతృత్వంలోని జేకేఐఎం జమ్మూకశ్మీర్‌లో వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తూ, భారత వ్యతిరేక ప్రచారం, ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతు ఇస్తోందని తెలిపింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల కోసం ఆ సంస్థ సభ్యులు నిధులు సేకరిస్తున్నటు పేర్కొంది. ఆయా కారణాల దృష్ట్యా 1967 చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద రెండు సంస్థలపైన ఐదేళ్ల పాటు నిషేధం విధిస్తున్నట్టు ఎంహెచ్‌ఏ స్పష్టం చేసింది.

# నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు



**హైదరాబాద్, మార్చి 11:** బుధవారం నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు భారీగా ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇకపోతే ఇప్పటికే అధికారులతో స్పీకర్ ప్రసాదరావు సమీక్షించారు. పలు సూచనలు చేశారు. అసెంబ్లీ పరిసరాల్లో 144 సెక్షన్ అమల్లోకి వచ్చింది.. తొలిరోజు ఉభయ సభల సభ్యులను ఉద్దేశించి గవర్నర్ జిజిష్టుదేవ్ వర్మ ప్రసంగిస్తారు. 13న గవర్నర్ ప్రసంగంపై చర్చ ఉంటుంది. 14న హోలీ సెలవు కారణంగా అసెంబ్లీకి కూడా సెలవు ప్రకటించారు. 15న గవర్ర్ ప్రసంగానికి సిఎం రేవంత్ సమాధానం ఇస్తారు. ఎస్సీ వర్గీకరణ, బిసి బిల్లులతో పాటు అంశాలు చర్చకు రానున్నాయి. కెసిఆర్ తొలిరోజు హాజరవుతారని ఇప్పటికే కెటిఆర్ సమాచారం ఇచ్చారు. అసెంబ్లీ వద్ద మూడంచెల భద్రత ఏర్పాట్లు చేశారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా నిరసనలు, ర్యాలీలు, ధర్నాలకు పోలీసులు అనుమతులు నిరాకరించారు. ఉదయం 11 గంటలకు అసెంబ్లీలో ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. ఇప్పటికే అన్ని శాఖల ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం, మంత్రుల సమావేశం జరిగింది. ఆయా శాఖలకు బడ్జెట్ లో నిధుల కేటాయింపుపై ప్రతిపాదనలు సమర్పించారు. ఈనెల 19 లేదా 20న ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క వార్షిక బడ్జెట్ ను ప్రవేశ పెట్టనున్నారు. ఈసారి మూడు లక్షల 20 వేల కోట్ల బడ్జెట్ ప్రవేశ పెట్టేఅవకాశం ఉంది. మార్చి 29 వరకు అసెంబ్లీ సమావేశాలు కొనసాగించనున్నట్లు సమాచారం. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ముందు తెలంగాణ భవన్‌లో కేసీఆర్ ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ అనుసరించాల్సిన వ్యూహం పై ఎమ్మెల్యేలకు దిశా నిర్దేశం చేశారు. బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ పై చర్చ లో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని నిర్ణయించారు. ఆరు గ్యారెంటీలకు బ్జడెట్ కేటాయింపులపై ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే విధంగా చర్చలో పాల్గొనాలని కేసీఆర్ సూచించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలిన ఘటన పై ప్రభుత్వ తప్పిదం ఉందంటూ ఎత్తి చూపాలన్నారు. కాళేశ్వరం రిపేర్ చేయక పోవడంతోనే పంటలు ఎండుతున్నాయి అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని బీఆర్ఎస్ ప్లాన్ చేస్తోంది. రాష్ట్రం లోని వివిధ అంశాలపై వాయిదా తీర్మానాలు ఇచ్చి.. వాటిపై చర్చ కు గట్టిగా పట్టు పట్టాలని ఎమ్మెల్యే లకు కేసీఆర్ సూచించారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న సందర్భంగా రాష్ట్ర శాసన సభ, శాసన మండలి సమావేశాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, లేవనెత్తిన అన్ని ప్రశ్నలకు త్వరితగతిన పూర్తి సమాచారంతో సమాధానాలు పంపాలని, అసెంబ్లీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సి.ఎస్ అధికారులకు సూచించారు. బడ్జెట్ సెషన్‌లో సరైన సమాచారం అందించేందుకు సంబంధిత కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని, శాఖల వారీగా నోడల్ అధికారులను కూడా నియమించుకోవాలని సి.ఎస్ అన్నారు. తదుపరి రోజుల్లో వివిధ శాఖల డిమాండ్లపై చర్చ జరగనున్నందున, వివిధ శాఖల వారీగా పూర్తి వివరాలతో అధికారులు సన్నద్ధం కావాలని సి.ఎస్ పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో రోడ్డెక్కిన ట్రిపుల్ ఆర్ బాధిత రైతులు

**మార్కెట్ ధరలకూ భూ పరిహారం చెల్లించాలని డిమాండ్**

**నేషనల్ హైవే అథారిటీ కార్యాలయం ముందు ధర్నా**

**హైదరాబాద్, మార్చి 11:** ట్రిపుల్ ఆర్‌లో భూములు కల్పోతున్న బాధితులు హైదరాబాద్‌లో రోడ్డెక్కారు. తమను రోడ్డున పడేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఆర్‌ఆర్‌ఆర్ బాధితులు ఆందోళనకు దిగారు. భూములు కోల్పోతున్న తమకు న్యాయం చేయాలంటూ బంజారాహిల్స్ రోడ్ నెం 2లోని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా రిజినల్ ఆఫీస్ ముందు ధర్నాకు దిగారు. చౌటుప్పల్, భువనగిరి, గజ్వేల్ ప్రాంతాల నుంచి వచ్చిన ఆర్‌ఆర్‌ఆర్ బాధిత రైతులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మార్కెట్ విలువ రూ.5 కోట్లకు పైగా ఉంటే ప్రభుత్వం రూ.20 లక్షలు మాత్రమే చెల్లిస్తోందని...తమ భూములకు మార్కెట్ ధరల ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మూడేళ్ళ నుంచి న్యాయం చేయాలని అన్ని ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా ఎవరు పట్టించు కోవడం లేదని ఆర్‌ఆర్‌ఆర్ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు . మున్సిపాలిటీల మధ్యలో నుంచి కాకుండా ట్రిపుల్ ఆర్ అలైన్ మెంట్ మార్చాలని డిమాండ్ చేశారు. వరంగల్ హైవే కోసం, కాళేశ్వరం కాలువల నిర్మాణానికి, ఎలక్ట్రిసిటీ హైటెన్షన్ టవర్స్ కోసం, యాదగిరి గుట్ట రోడ్డు అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇప్పటికే తమ భూములు తీసుకుందన్నారు. అభివృద్ధి పేరుతో మళ్లీ తమ భూములను లాక్కుంటే వ్యవసాయం ఎలా చేసుకోవాలని..ఎలా బతకాలని ప్రశ్నించారు. భూముల కోల్పోతున్న బాధిత రైతులకు ప్రత్యామ్నాయం చూపి..సరైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో ట్రిపుల్ ఆర్ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ముందుగా ప్రభుత్వం ట్రిపుల్ నార్త్ పూర్తి చేసేందుకు సిద్ధమైంది. ఇప్పటికే దీనికి సంబంధించిన భూసేకరణ పూర్తయింది. 161.518 కిలోమీటర్ల( ట్రిపుల్ ఆర్ నార్త్) రోడ్డును రూ.7104.06 కోట్లతో నిర్మిస్తున్నారు.1వ ప్యాకేజీ: గిర్మాపూర్ నుంచి రెడ్డిపల్లి వరకు 34.518 కిలోమీటర్ల నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని రూ. 1529.19 కోట్లతో రెండేండ్లలో నిర్మించాలి. ఐదేండ్లు మెయింటెనెన్స్ చేయాలి. 2వ ప్యాకేజీ: రెడ్డిపల్లి నుంచి ఇస్లాంపూర్ వరకు 26 కిలోమీటర్ల 4 వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని రూ.1114.80 కోట్లతో రెండేండ్లలో నిర్మించాలి. ఐదేండ్ల మెయింటెనెన్స్ చేయాలి.3వ ప్యాకేజీ: ఇస్లాంపూర్ నుంచి ప్రజ్ఞాపూర్ వరకు 23 కిలోమీటర్ల నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని రూ.1184.81 కోట్లతో రెండేండ్లలో నిర్మించాలి. ఐదేండ్లు నిర్వహించాలి. 4వ ప్యాకేజీ: ప్రజ్ఞపూర్ నుంచి రాయగిరి వరకు 43 కిలోమీటర్లు నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని 1728.22 కోట్లతో రెండేండ్లలో నిర్మించాలి. ఐదేండ్ల మెయింటెనెన్స్ చేయాలి. 5వ ప్యాకేజీ: రాయగిరి నుంచి తంగడ్ పల్లి వరకు 35 కిలోమీటర్ల నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని రూ.1547.04 కోట్లతో రెండేండ్లలో నిర్మించాలి. ఐదేండ్లు నిర్వహించాలి ఈ క్రమంలో ఇప్పటకిఏ భూసేకరణ మొదలయ్యింది. తమకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని రైతులు హెచ్చరించారు.

# పోలవరం ఎత్తును తగ్గించరాదు

**ఎత్తు తగ్గిస్తే స్టోరేజీ కెపాసిటీ తగ్గుతుంది.. లోక్‌సభలో ఎంపీ గురుమూర్తి ప్రస్తావన**

**న్యూఢిల్లీ,మార్చి11 :** పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గింపు, బడ్జెట్ లో పోలవరంకు కేటాయించిన నిధులు, పెరిగిన పోలవరం ప్రాజెక్టు ఖర్చు, విద్యారంగం తదితర అంశాలపై వైఎస్సార్‌సీపీ తన గళం వినిపించింది. ఉభయ సభల్లోనూ వైఎస్సార్‌సీపీ ఎంపీలు కొన్ని కీలకాంశాలు లేవనెత్తారు. మంగళవారం పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీ గురుమూర్తి.. లోక్‌సభలో మాట్లాడుతూ.. 'పోలవరం ఎత్తును 45.72 మీటర్ల నుంచి 41.15 మీటర్లకు తగ్గించారు. పోలవరం ఎత్తు తగ్గించడం వల్ల స్టోరేజ్ కెపాసిటీ 194 నుంచి కేవలం 115 టీఎంసీలకే పరిమితమవుతుంది. దీనివల్ల సాగునీరు, తాగు నీటికి , విద్యుత్తు ఉత్పత్తి పైన తీవ్ర ప్రభావం పడుతుంది. ఒరిజినల్ పోలవరం డ్యాం ఎత్తు ప్రకారమే నిర్మించాలన్నారు. ఇటీవలబడ్జెట్‌లో పోలవరంకు అరకొరగా రూ. 5936 కోట్లు మాత్రమే కేటాయించారు. పెరిగిన పోలవరం ఖర్చును ఎవరు భరిస్తారు?, పోలవరం సిఈఓ ఆఫీస్ ను ఏపీకి తరలించాలి. ఏపీలో 17 కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనుమతులు తీసుకుంది. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం లేఖతో కడప మెడికల్ కాలేజీ పర్మిషన్ ను ఉపసంహరించారు. మౌలిక వసతులు లేవనే రాష్ట్ర ప్రభుత్వం లేఖతో ..మెడికల్ కాలేజీలకు పర్మిషన్ వెనక్కి తీసుకోవడం చరిత్రలో ఇదే తొలిసారి. 17 మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయకూడదు. వైజాగ్ స్టీల్ ఎ÷-లాంట్ ను ప్రైవేటీకరణ చేస్తారా లేదన్న అంశంపై కేంద్రం స్పష్టత ఇవ్వాలి. వైజాగ్ స్టీల్ ఎ÷-లాంట్ కు సొంత గనులు ఇస్తారా లేదో చెప్పాలి. దుగ్గరాజపట్నం పోర్టు, కడప స్టీల్ ఎ÷-లాంట్ ఏర్పాటు చేయాలి. విభజన చట్టం ప్రకారం ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలి. ఇప్పటివరకు ఈ హామీని నిలుపుకోకపోవడం ప్రజలను మోసం చేయడమే. అమరావతికి ఇచ్చే 15000 కోట్ల రూపాయలను ఎవరు చెల్లిస్తారు?, అమరావతి అప్పులను ఎవరు చెల్లిస్తారనేది స్పష్టం చేయాలని ఎంపీ గురుమూర్తి డిమాండ్ చేశారు. ÷ూజ్యసభలో విద్యాశాఖ పద్దులపై వైఎస్సార్‌సీపీ ఎంపీ గొల్ల బాబురావు మాట్లాడుతూ.. ' వైఎస్ జగన్ హయాంలో ఏపీలో విద్యారంగం అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. విద్యా దీవెన, విద్యా వసతి దీవెన కింద రూ. 73 వేల కోట్లు రూపాయిలు విద్యార్థుల కోసం ఖర్చు చేశారు. 45 వేల ప్రభుత్వ పాఠశాలలను నందనవనంగా తీర్చిదిద్దారు. దీన్ని చూసి ఇతర రాష్ట్రాలు కూడా అమలు చేశాయి. కాలేజీ విద్యను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది కాలేజీలో కేవలం డిగ్రీలు ఇచ్చే సంస్థలుగా మారిపోయాయి. ఎలాంటి నైపుణ్యాలు లేకుండా విద్యార్థులు బయటకు వస్తున్నారు' అని ఎంపీ గొల్ల బాబురావు స్పష్టం చేశారు.



# అమెరికా స్టాక్ మార్కెట్లలో భారీ కుదుపు

**దాదాపు రూ.349 లక్షల కోట్లు మేరకు ఆవిరి**

**ఆర్థిక వ్యవస్థ పటిష్టంగానే ఉందని వైట్‌హౌజ్ ప్రకటన**

**న్యూయార్క్, మార్చి 11:** అమెరికా స్టాక్ మార్కెట్లు దాదాపు 20 రోజుల వ్యవధిలోనే భారీగా పతనం అయ్యాయి. స్టాక్స్‌లోని మదుపర్ల సంపద 4 ట్రిలియన్ డాలర్ల మేర అంటే దాదాపు రూ.349 లక్షల కోట్లు మేరకు ఆవిరైపోయింది. ఇది యూకే, ఫ్రాన్స్ వంటి దేశాల జీడీపీ కంటే ఎక్కువ కావడం గమనార్హం. ముఖ్యంగా అమెరికా ఫెడరల్ గవర్నమెంట్ షట్‌డౌన్ భయాలు సూచీలను వెంటాడుతున్నాయి. దీనికి ట్రంప్ అస్థిర విధానాలు తోడయ్యాయి. ఓవైపు మారెట్లు పతనం అవుతున్నా.. ఆర్థిక వ్యవస్థ మాత్రం బలంగానే ఉందని శ్వేతసౌధంలోని ది నేషనల్ ఎకనామిక్ కౌన్సిల్ అధిపతి కెవిన్ హస్సెట్ట్ చెప్పారు. ఆర్థిక మాంద్యం భయాలను తోసిపుచ్చారు. ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని చెప్పేందుకు పలు కారణాలున్నాయన్నారు. ఇక సుంకాల విషయంలోని అస్పష్టత త్వరలోనే తొలగిపోతుందన్నారు. ఇక పన్ను కోతలు పెట్టుబడులను ప్రోత్సహిస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లపై తీసుకొనే నిర్ణయం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఎస్‌అండ్‌పీ 500 సూచీ ఫిబ్రవరి 19వ తేదీన నమోదు చేసిన ఆల్‌టైమ్ హై నుంచి ఇప్పటికి 8 శాతానికిపైగా విలువ కోల్పోయింది. నాస్‌డాక్ కాంపోజిట్ డిసెంబర్‌లో నమోదుచేసిన అత్యధిక విలువ నుంచి 10శాతం పతనమైంది. ఇక ఒక్క సోమవారమే 1.7 ట్రిలియన్ డాలర్ల సంపద కరిగిపోయింది. 2022 సెప్టెంబర్ తర్వాత ఈ స్థాయిలో పతనం కావడం ఇదే తొలిసారి. ఇక మస్క్ నేతృత్వంలోని టెస్లా షేర్ ధర 15శాతం పతనం కావడం గమనార్హం. డిసెంబర్ 17 నుంచి ఈ సంస్థ షేరు విలువ 50శాతం ఆవిరైంది. నాడు అత్యధికంగా 479.86 డాలర్లు ఉండగా.. నేడు అది 222.15 డాలర్లకు చేరింది. వివిధ కారణాలు కలిసి ఓ ప్యాకేజీలా మార్కెట్లను దెబ్బతీస్తున్నాయి. ముఖ్యంగా వాణిజ్య విధానాల్లో హఠాత్తుగా వస్తున్న మార్పులు, ఆర్థిక మాంద్యం భయాలు, స్టాక్స్ అధిక విలువలు వంటివి కారణవ-ఎవుతున్నాయని లాజర్డ్ సీఈవో పీటర్ ఓర్స్‌జాగ్ వెల్లడించారు. ముఖ్యంగా ప్రధాన వాణిజ్య భాగస్వాములైన కెనడా, మెక్సికో, ఐరోపాతో వాణిజ్య యుద్ధాల వల్ల చాలా కంపెనీలు తమ వ్యాపార వ్యూహాలను పునఃపరిశీలిస్తున్నాయన్నారు. అమెరికాలోని భారీ సంపన్నులపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటోంది. అక్కడి మార్కెట్లలో 50 శాతం విలువైన సంపద 1శాతం మంది వద్ద ఉంటుంది. ఇక 37శాతం విలువైన సంపద 10శాతం మంది వద్ద ఉంటుంది. 12శాతం వాటా 40శాతం మంది వద్ద కేంద్రీకృతమైంది. మిగిలిన 1శాతం వాటా 50శాతం మంది ప్రజల చేతిలో ఉందని ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ సెయింట్ లూయిస్ డేటా పేర్కొంది. ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాట్లాడుతూ ప్రస్తుతం దేశం మార్పు దశలో ఉందని ఓ టీవీ షోలో అభివర్ణించారు. అదే సమయంలో ఆర్థిక మాంద్యం రాదని కచ్చితంగా చెప్పలేదు. యాంకర్ అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. తాను అలాంటి విషయాలను ఊహించడాన్ని కూడా ఇష్టపడనని చెప్పారు. ఇప్పుడు తమ ప్రభుత్వం చాలా పెద్దపని చేపట్టిందని.. ఈ క్రమంలో మార్పు దశ ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్ పతనానికి, ఆర్థిక మాంద్యానికి ట్రంప్ సర్కారు సిద్ధమైందనే సంకేతాలున్నట్లు మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. గోల్డ్‌మన్ శాక్స్ కూడా అమెరికాలో వచ్చే 12 నెలల్లో ఆర్థిక మాంద్యం వచ్చేందుకు 15-20శాతం అవకాశాలున్నాయని అంచనా వేసింది.

# నేను అసెంబ్లీకి వస్తున్నా..



- అంతా సిద్ధం కండి
- అసెంబ్లీలో సమస్యలపై పోరాడుదాం
- ప్రభుత్వ తీరును సహేతుకంగా ఎండగడదాం
- బీఆర్ఎస్ఎల్పీలో సమావేశంలో కెసిఆర్ కీలక ఆదేశాలు

**హైదరాబాద్, మార్చి 11:** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి , అసెంబ్లీలో విపక్షనేత కేసీఆర్ అసెంబ్లీకి రానున్నారు. నేనూ వస్తున్నా.. మీరంతా రావాలి..సమస్యలపై పోరాడుదాం అని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం 9:30 నిమిషాలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రావాలని సూచించారు. ప్రతిరోజూ అసెంబ్లీకి తప్పకుండా హాజరుకావాలని సూచించారు. అరగంట ముందుగా 9:30 కే అసెంబ్లీకి రావాలని పిలుపునిచ్చారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ఎల్పీలో సమావేశంలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. సమావేశాల్లో మాట్లాడే అంశాలపై పూర్తిగా అధ్యయనం చేసి మాట్లాడాలని సూచించారు. ఈ మేరకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. 'హామీల అమల్లో వైఫల్యంపై ప్రభుత్వాన్ని నిలదీయాలి. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులు, సృష్టించిన ఆస్తుల గురించి సుదీర్ఘంగా వివరించాలి. పదేళ్లలో బీఆర్ఎస్ నాలుగు లక్షల కోట్ల అప్పు చేస్తే కాంగ్రెస్ 14 నెలల్లోనే లక్షా 50 వేల కోట్ల అప్పులు చేసింది. అప్పుల విషయంలో కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని బలంగా తిప్పికొట్టాలి. భారీగా అప్పులు చేసినా హామీలు అమలు చేయడం లేదు. రైతుబంధు, సాగునీరు ఇవ్వకుండా రైతులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రజలు పడుతున్న కష్టాలను, వారి ఆకాంక్షలను అర్థం చేసుకొని వారి గొంతుకగా బీఆర్ఎస్ సభ్యులు ఉభయ సభల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. గొర్రెల పెంపకం.. చేపల పంపిణీ సమగ్ర అమలు కోసం.. అసెంబ్లీ మండలిలో ప్రభుత్వాన్ని నిలదీయాలి. బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ రిజర్వేషన్ల బిల్లుకు మద్దతుగా గొంతు వినిపించాలి. గురుకులు నిర్వీర్యమౌతున్న తీరుపై మాట్లాడాలి. ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్, డీఏల పెండింగ్స్, పీఆర్సీ అమలుపై అసెంబ్లీ మండలి వేదికగా నిలదీయాలి. మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని కొట్లాడాలి. 6 గ్యారంటీల అమలులో ప్రభుత్వం అనుసరిస్తున్న మోసపూరిత వైఖరిని నిలదీయాలి. విద్యార్థుల ఓవర్సీస్ స్కాలర్షిప్ లు విడుదలచేయక పోవడం, వైద్య రంగంలో దిగజారుతున్న ప్రమాణాలు, తదితర ప్రజా సమస్యలు ఎండగట్టాలి. దళిత బంధును నిలిపివేయడం పట్ల ప్రశ్నించాలి..' అని మాజీ సీఎం కేసీఆర్ సమావేశంలో తెలిపారు.

# ఆగమైపోతున్న తెలంగాణ రైతన్న

## నీళ్లు లేక..కరెంట్ రాక వ్యవసాయం అధోగతి

## మరోమారు కాంగ్రెస్‌పై మండిపడ్డ కేటీఆర్



**హైదరాబాద్, మార్చి 11:** కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆగమైపోతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. సాగుకు సరిపడా నీళ్లు లేక, విద్యుత్ కోతలతో అన్నదాత బోరున విలపిస్తున్నా పట్టించుకునే నాధులు లేరని అన్నారు. చేతికొచ్చిన పంటలు ఎండిపోతుంటే రైతన్న తల్లడిల్లిపోతున్నాడు. ఏం చేయాలో దిక్కుతోచక కొందరు అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటుంటే.. మరికొందరు కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారు. అన్నదాతల సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని కేటీఆర్ అన్నారు. అలంపూర్ నుండి ఆదిలాబాద్ వరకు అశ్వారావుపేట నుండి జహీరాబాద్ వరకు వ్యవసాయం తిరోగమనంలో ఉందన్నారు. సాగునీళ్లు లేక పంటలు ఎండిపోతున్నయ్.. రైతుల గుండెలు మండిపోతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ వచ్చింది.. కరువును తెచ్చిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో నడి ఎండకాలంలోనూ చెరువులు మత్తళ్లు దుంకాయని కేటీఆర్ గుర్తు చేశారు. నేడు అదే చెరువులు నీళ్లు లేక వెలవెలబోతున్నాయని మండిపడ్డారు. నాడు కాలువల నిండా నీళ్లతో ఏడాదికి రెండు పంటలు పండించుకునేందుకు కేసీఆర్ అండగా నిలిస్తే.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులను పడావుబెట్టి, నీళ్లను ఆంధ్రాకు వదిలి పంటలను ఎండబెడుతుందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలో సమయానికి రైతుబంధు, 24 గంటల ఉచిత కరంటు, సాగునీళ్లు, విత్తనాలు, ఎరువులు, పంటల కొనుగోళ్లతో రైతు కంటినిండా నిద్ర, కడుపు నిండా సంతోషంగా ఉన్నాడని కేటీఆర్ గుర్తు చేశారు. 15 నెలల కాంగ్రెస్ పాలనలో రైతుభరోసా రాదు, సాగునీళ్లు ఇవ్వరు, కరంటు ఇవ్వరు, విత్తనాలు దొరకవు, ఎరువులు ఉండవు, అన్ని గండాలు దాటుకుని పంటలు పండిస్తే కొనుగోళ్లు ఉండవు అని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో వ్యవసాయ అనుకూల విధానాలతో పండగలా వ్యవసాయం ఉండే అని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో అన్నదాతపై కక్షగట్టి వ్యవసాయాన్ని ఆగంపట్టించారని మండిపడ్డారు.

# కొండపర్తి బ్రాండ్ కనిపించాలి

- దత్తత గ్రామంలో మంత్రి సీతక్కతో కలసి పర్యటన
- గిరిజనుల ఇంగ్లీష్ ప్రావీణ్యంపై ఆశ్చర్యం
- కొండపర్తిలో పర్యటించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ




**ములుగు, మార్చి 11 :** తాను దత్తత తీసుకున్న ములుగు జిల్లా కొండపర్తి గ్రామానికి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ రోడ్డు మార్గాన చేరుకున్నారు. మంత్రి సీతక్క, ప్రిన్సిపల్ సెక్రెటరీ కిషోర్ , కలెక్టర్ దివాకర, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా ఘన స్వాగతం పలికారు. ఆదివాసీలు వారి నృత్యాలతో ఆకట్టుకున్నారు. కుమురం భీమ్, బిర్సా ముండా విగ్రహాలకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, మంత్రి సీతక్క ఆవిష్కరించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ అభివృద్ధి నిమిత్తం రూ. కోటి 50 లక్షల విలువైన పనులు ప్రారంభించారు. మహిళల కోసం ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. అగన్వాడీ కేంద్రంలో విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. మహిళల కొరకు మిర్చి యూనిట్, మసాల, పసుపు, పిండి యూనిట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ మాట్లాడుతూ.. 'ఆదివాసీలు వెనకబడి ఉన్నారు కాబట్టి అధికారులందరూ కలిసి ఈ గ్రామాన్ని అభివృద్ధి చేయాలి. ఇక్కడ పిల్లలు ఇంగ్లీష్ లో మాట్లాడం చాలా ఆనందం అనిపించింది. ఈ కొండపర్తి గ్రామాన్ని దేశంలో రోల్ మోడల్ గ్రామంగా తీర్చిదిద్దాలి. నేను ఆదివాసీ కుటుంబం నుంచి వచ్చాను. మా గ్రామం కూడా నా చిన్నప్పుడు కొండపర్తిలానే ఉండేది.కొండపర్తిలో తయారుచేసే మసాలా, కారం, పసుపు ఒక ప్రత్యేక బ్రాండ్ లు గా నిలవాలని ఆయన పేర్కొన్నారు.

# శ్రీచైతన్య కాలేజీల్లో కొనసాగుతున్న దాడులు

## 5కోట్ల నగదును స్వాధీనం చేసుకున్న అధికారులు

**హైదరాబాద్, మార్చి 10 :** శ్రీచైతన్య కాలేజీల్లో ఐటీ సోదాలు వరుసగా రెండోరోజూ కొనసాగాయి. మాదాపూర్‌లోని ప్రధాన కార్యాలయంలో ఐటీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు రూ.5 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఏపి, తెలంగాణతో పాటు 10 ప్రాంతాల్లో దాడులు చేస్తున్నారు. అడ్మిషన్లు, ట్యూషన్ ఫీజుల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నట్టు గుర్తించారు. లావాదేవీల సాఫ్ట్‌వేర్‌ను ఐటీ అధికారులు పరిశీలించారు. శ్రీచైతన్య కాలేజీల ట్యాక్స్ చెల్లింపులపై ఐటీ ఆరా తీస్తోంది. 2020లోనూ శ్రీచైతన్య కాలేజీలపై ఐటీ సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. గతంలోనూ రూ.11 కోట్లు స్వాధీనం చేసుకున్నవిషయం విదితమే. దేశవ్యాప్తంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల కార్యాలయాలపై ఐటీ అధికారులు దాడులు చేపట్టారు. విద్యార్థుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తూ పన్నులు చెల్లించకుండా ఎగవేస్తున్నారని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సోదాలు చేపట్టారు. హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, ముంబై సహా పలు ప్రాంతాల్లోని శ్రీ చైతన్య విద్యాసంస్థల కార్పొరేట్ కార్యాలయాలపై ఒక్కసారిగా దాడులు చేపట్టారు. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తూ రశీదులు ఇవ్వకుండా పెద్దఎత్తున ట్యాక్స్ ఎగ్గొడుతున్నట్లు సోదాల్లో అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. ముందుగా హైదరాబాద్ మాదాపూర్‌లోని ప్రధాన కార్యాలయంలో సోదాలు నిర్వహించిన అధికారులు అక్రమ లావాదేవీలు గుర్తించినట్లు సమాచారం. అలాగే దేశవ్యాప్తంగా ఉన్న శ్రీచైతన్య కార్పొరేట్ కార్యాలయాలపై దాడులు చేశారు. ఈ సోదాల్లోనూ పెద్దమొత్తంలో అక్రమ లావాదేవీలు గుర్తించినట్లు తెలుస్తోంది. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి నేరుగా నగదు తీసుకునేందుకు ఒక సాఫ్ట్వేర్.. అలాగే ప్రభుత్వానికి కట్టే ట్యాక్స్ కోసం మరో సాఫ్ట్వేర్ ఏర్పాటు చేసుకున్నట్లు ఐటీ అధికారులు నిర్ధారించారు.

# రెండు నెలల్లో ట్రిపుల్ ఆర్‌కు అనుమతులు

- కేంద్రమంత్రి గడ్కరీ హామీ ఇచ్చారు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**న్యూఢిల్లీ, మార్చి 11:** రీజినల్ రింగ్‌రోడ్డుకు సంబంధించిన అన్ని అనుమతులు రెండు నెలల్లో ఇస్తామని, అన్ని క్లియరెన్స్‌లు వచ్చాక ప్రధాని దృష్టికి తీసుకెళ్తామని కేంద్ర మంత్రి గడ్కరీ హామీ ఇచ్చారని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. రీజినల్ రింగ్‌రోడ్డు, హైవేల కోసం గడ్కరీతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'సంగారెడ్డి - భువనగిరి - చౌటుప్పల్ వరకు ఆర్ఆర్ఆర్ టెండర్ల ప్రక్రియ పూర్తయింది. దాదాపు 95శాతం భూ సేకరణ కూడా పూర్తయింది. రూ.వెయ్యి కోట్లతో 12 ఆర్వోబీలు కూడా మంజూరు చేశారు. హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారి ఆరు లేన్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని గడ్కరీ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి మచిలీపట్నం వరకు రోడ్డు విస్తరణ ఆలస్యమవుతున్నందున.. గుడిమల్కాపూర్ నుంచి విజయవాడ వరకు ఒక ప్యాకేజీ, విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు మరో ప్యాకేజీగా విభజించి టెండర్లు పిలవాలని అధికారులను గడ్కరీ ఆదేశించారు. 62 కి.మీ మేర శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామని కేంద్ర మంత్రి చెప్పారు' అని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు.

# విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

## ఒక విద్యార్థి మృతి...మరో నలుగురుకి తీవ్ర గాయాలు

## వీరంతా ఎంజిఐటి విద్యార్థులుగా గుర్తింపు




**హైదరాబాద్, మార్చి 11:** నగర శివారులోని గండిపేట మూవీ టవర్స్ వద్ద మంగళవారం సాయంత్రం ఘోర ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న శ్రీకర్ అక్కడికక్కడే మృతి చెందగా, హేమసాయి, వివేక్, సుజన్, కార్తికేయ, హర్షకు తీవ్ర గాయాలయ్యాయి. ఎంజీఐటీ కాలేజీ ఇంజినీరింగ్ విద్యార్థులు ఆరుగురు కారులో నార్సింగి నుంచి నియోపొలిస్ వైపు వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. వేగంగా స్తంభాన్ని ఢీకొట్టడంతో కారు నుజ్జు నుజ్జు అయ్యింది. క్షతగాత్రులను సమీపంలోని కాంటినెంటల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనా స్థలికి చేరుకున్న నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కోకాపేట నియో పోలీస్ సర్కిల్ ఆటోస్టాండ్ దగ్గర ఈ ప్రమాదం జరిగింది . అతివేగంగా వచ్చి ఎలక్ట్రిక్ పోల్ ను ఢీకొట్టడంతో కారు నాలుగు పల్టీలు కొట్టి తుక్కుతుక్కుయింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఒకరు అక్కడిక్కడే మృతి చెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలైనట్లు తెలుస్తోంది. ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కారులో ప్రయాణిస్తున్న విద్యార్థులంతా ఎంజీఐటీ కాలేజీలో బీటెక్ ఫస్ట్ ఇయర్ స్టూడెంట్స్ అని సమాచారం. గండిపేట్ లోని కాలేజీ నుంచి హైదరాబాద్ వైపు వెళుతుండగా ప్రమాదం జరిగింది. మితి మీరిన వేగమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో బాధితుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

# ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కొనసాగుతున్న ఆపరేషన్

## రోబోలను రంగంలోకి దింపిన అధికారులు



**నాగర్‌కర్నూలు, మార్చి 11:** ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో రెస్క్యూ ఆపరేషన్ 18వ రోజు కొనసాగుతుంది. మంగళవారం రోబోలతో రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. ఇప్పటికే టన్నెల్‌లోకి అన్వీ రోబో బృందం వెళ్లింది. డేంజర్ జోన్‌లో రోబోలతో తవ్వే ప్రయత్నం చేశారు. క్యాడవర్ డాగ్స్ గుర్తించిన రెండు చోట్ల తవ్వకాలు మొదలు పెట్టారు. కాగా.. సాయంత్రానికి రెండు మృతదేహాలు వెలికితీసే అవకాశం ఉంది. కేరళకు చెందిన క్యాడవర్ శునకాలు మృతదేహాల ఆనవాళ్లు పసిగట్టాయి. దాంతో ఆ ప్రాంతంలో తవ్వితే ఒకరి మృతదేహం బయటకు తీశారు. అతి కష్టం మీద మరో ఐదడుగులు తవ్వారు. ఇంజనీర్ ఆచూకీని కనుగొన్న ప్రాంతానికి కొంచెం అటు ఇటుగా మరో ముగ్గురు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. మరో ఇద్దరి జాడ లభించే అవకాశం ఉంది. మిగిలిన వారు సొరంగం చిట్ట చివరి భాగం దగ్గర టీబీఎం కట్టర్ సమీపంలో చిక్కుకుని ఉండొచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం టన్నెల్‌లో టీబీఎం మిషన్ కట్టింగ్, డీ వాటరింగ్ కొనసాగుతుంది.శ్రీశైలం ఎడమ కాలువ ప్రాజెక్టు టన్నెల్ నిర్మాణ సమయంలో 8 మంది మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం టన్నెల్‌లో గౌరావ్ పెనిట్రేటింగ్ రాడార్ , క్యాడవర్ డాగ్స్ సాయంతో తవ్వకాలు కొనసాగుతున్నాయి. రాడార్, శునకాలు గుర్తించిన ప్రదేశాలను డీ1, డీ2, డీ3 ప్రాంతాలుగా విభజించి అక్కడ తవ్వకాలు చేపట్టారు అధికారులు. ఆదివారం నాడు డీ2 ప్రాంతంలో తవ్వకాలు జరిపిన రెస్క్యూ టీమ్స్ ఓ ఇంజనీర్ మృతదేహాన్ని వెలికితీశాయి. రెస్క్యూ ఆపరేషన్ కు అడ్డుపడుతున్న టన్నెల్ బోరింగ్ మెషిన్ (÷ుఃఓ) కట్టింగ్, నీటి తొలగింపు పనులు కూడా నిరంతరం జరుగుతున్నాయి. కార్మికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎంతమాత్రం అలసిపోకుండా, బృందాలు ఎప్పటికప్పుడు తమపనిని చురుకుగా కొనసాగిస్తున్నారు. ఎన్డీఆర్ఎఫ్ , రెస్క్యూ టీమ్స్, పోలీసు విభాగం, ఫోరెన్సిక్, వైద్య బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి.




# చట్టసభల చులకన తగదు!

చట్టసభలకు ఎన్నికైన వారు.. సభకు, ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా నడుచుకోవాలి. సభలో ప్రజల పక్షాన నిలబడాలి. హోదాతో సంబంధం లేకుండా నడుచు కునేలా చూసుకోవాలి. అయితే తెలుగు రాష్ట్రాల్లో విచిత్ర పరిస్థితి నెలకొంది. ప్రతిపక్షహోదా కలిగిన బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ చట్టసభలకు రావడం లేదు. సభలో ప్రజాసమస్యలపై చర్చించడం లేదు. ప్రతిపక్ష హోదా ఉన్నా కూడా యాన సభకు రాకుండా మొహం చాటేస్తున్నారు. పదేళ్లపాటు సిఎంగా పని చేసిన కెసిఆర్ విపక్షానికి పరిమితం కావడంతో ఇక ప్రజలతో పనేం అన్న విధంగా వ్యవహరిస్తున్నారు. ఈ ప్రభుత్వం బాగా పనిచేయడం లేదని, ఇక అంతు తేలుస్తానని బయటనుంచి మాట్లాడుతున్నారు. కానీ సభకు వచ్చి సమసయలను ప్రస్తావించడం, తన ప్రభుత్వ హయాంలో జరిగిన మంచిచెడులను చర్చించడం జరగడం లేదు. ఇది ఓ రకంగా ప్రజలను అవమానించడం తప్ప మరోటి కాదు. అలాంటప్పుడు జీతభత్యాలు తీసుకోరాదు. నిజానికి ప్రజాప్రతినిధులకు జీతభత్యాలు, పెన్షన్లపై చర్చించాలి. వారికి కోట్లాది రూపాయలు చెల్లించాల్సిన అవసరమేముందో తేల్చాలి. ప్రజలు పన్నుల రూపంలో కట్టిన డబ్బుతో వారు సుఖాలు అనుభవిస్తున్నారు. సభాధ్యక్షుడి గుర్తింపు పొందితేనే సభా ప్రాంగణంలో కార్యాలయానికి గది కేటాయింపు వంటి వసతుల కల్పనకు అవకాశం ఉంటుంది. స్పీకర్ ఆధ్వర్యంలో పనిచేసే బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశాలకు పిలుపు వస్తుంది. వసతుల కల్పనకు నిబంధనలు వేరుగా ఉంటాయి. దీనికి సంబంధించి పార్లమెంటులో మూడు నిబంధనలు పొందుపరిచారు. వాటినే అసెంబ్లీల్లో పాటిస్తున్నారు. కనీసం పదిశాతం సీట్లు పొందిన వారికే విపక్షపార్టీగా గుర్తింపు దక్కుతుంది. గత పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీకి విపక్షహోదా దక్కలేదు. అది కావాలని ఆ పార్టీ పట్టుబట్టలేదు. ఫలితంగా పది సంవత్సరాలు లోక్‌సభలో ప్రతిపక్ష నేత అన్న వ్యవస్థ లేకుండా గడిచింది. 2014లోనూ, 2019 లోనూ కాంగ్రెస్ పార్టీ అతి పెద్ద ప్రతిపక్ష పార్టీగా ఉన్నప్పటికీ దానికి పదో వంతు సంఖ్యా బలం లేదు. పదో వంతు సంఖ్యా బలం లేనప్పుడు ప్రతిపక్ష గ్రూప్‌గా గుర్తిస్తారుగాని ప్రతిపక్ష పార్టీగా గుర్తించక పోవటం గతంలో కూడా జరిగింది. 1984లో ఇందిరా గాంధీ హత్యానంతరం జరిగిన ఎన్నికల్లో లోక్‌సభలో అతి పెద్ద ప్రతిపక్షంగా ఏ జాతీయ పార్టీ నిలువలేదు. ప్రాతీయ పార్టీ అయిన తెలుగు దేశానికి ప్రతిపక్ష గ్రూప్ అన్న గుర్తింపు దక్కింది. అయితే చట్టంలో ప్రతిపక్ష నేతగా గుర్తింపు పొందాలంటే పదో వంతు సభ్యులుండాలన్న నిబంధన అన్నది సంప్రదాయంగా వస్తున్న నిబంధన మాత్రమే. 1977లో మొదటిసారి ప్రతిపక్ష నాయకుడు అనే వ్యవస్థ ఏర్పడింది చట్టం ద్వారా. అయితే 1977లో అప్పటి జనతా ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టం ప్రతిపక్ష నాయకుడిగా గుర్తింపునకు కనీస సభ్యుల సంఖ్యను సూచించలేదు. సభలో అధికారపార్టీని వ్యతిరేకించే పార్టీలలో ఎక్కువమంది సభ్యులుండే పార్టీనేతను ప్రతిపక్ష నేతగా సభాధ్యక్షులు గుర్తిస్తారని పేర్కొన్నది. సభలో అధికార పక్షాన్ని వ్యతిరేకించే ప్రతిపక్ష పార్టీలు సమాన సంఖ్యా బలం కలిగి వుంటే ఏ పార్టీ నేతను ప్రతిపక్ష నాయకుడుగా గుర్తించాలనేది ఆ యా పార్టీల స్థితిగతుల ఆధారంగా సభాధ్యక్షుడు నిర్ణయిస్తారు. ఆ విధంగా సభాధ్యక్షుడి గుర్తింపు పొందిన ప్రతిపక్ష నేతకు కొన్ని సదుపాయాలు కల్పిస్తారు. సభ లోపల వెలుపలా కూడా. జీత భత్యాలు, వాహనం, సహాయ సిబ్బంది, అధికారిక నివాసం మొదలైనవి వస్తాయి.. ప్రతిపక్ష నేతకు కాబినెట్ మంత్రి హోదా కల్పించటం ఒక సంప్రదాయంగా వస్తున్నది. అయితే ఇక్కడ ముఖ్యమైన అంశం ఏమిటంటే ఒక పార్టీకి చట్టసభలో గుర్తింపు పొందటానికి అవసరమైన సభ్యులే లేకపోతే, అలాంటి పార్టీ నాయకుడికి ప్రతిపక్ష హోదా ఇచ్చే ప్రసక్తే లేదనేది 2014లో నాటి లోక్‌సభ స్పీకర్ తేల్చేశారు. ఇది రాజకీయపరమైన నిర్ణయం. ఈ వాదన 2014లో తెర మీదకు వచ్చింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పదో వంతు సభ్యులు కూడా లేరు. కాంగ్రెస్ పార్టీ దానిమీద ఏమీ రాద్ధాంతం చెయ్యలేదు. సభా కార్యకలాపాలకు దూరంగానూ లేదు. ప్రతిపక్ష నాయకుడిని సంప్రదించవలసిన ప్రతి సందర్భంలోను అప్పుడు కాంగ్రెస్ పార్టీ లోక్‌సభాపక్ష నేత అధీర్ రంజన్ చౌదరిని ప్రభుత్వం సంప్రదించింది. రాజ్యాంగ బద్ధమైన పదవులకు నియామకాలు చేసే కమిటీలో ప్రతిపక్ష నేత కూడా సభ్యుడు. ఉదాహరణకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి నియామకం. అటువంటి నియామకాలప్పుడు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వకున్నా నరేంద్ర మోడీ ప్రభుత్వం అధీర్ రంజన్ చౌదరిని సంప్రదించింది. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే ప్రతిపక్షనేత హోదా కావాలని జగన్ పట్టుబట్టడం అసమంజసం. తనకు దక్కదని తెలిసి కూడా ఆ హోదా కోసం ఆరాటపడటం హుందాతనం అనిపించు కోదు. సభలో మాట్లాడటానికి కేటాయించే సమయం రాజకీయ పక్ష సభ్యుల సంఖ్యాబలం మీద ఆధారపడి ఉంటుంది. మాట్లాడే హక్కు ప్రతి సభ్యుడికీ ఉంటుంది. ఎంతసేపు అనేది సభాపతి నిర్ణయం. ప్రతిపక్షనేత గనుక కచ్చితంగా ఇంత సమయం కేటాయించాలి అన్న నిబంధన ఏమీ లేదు. తనకు 40 శాతం ఓట్లు వేసిన ప్రజల పక్షాన పోరాడాల్సిన సమయంలో హోదా ఇవ్వలేదనే వంకతో అసెంబ్లీకి రాకపోవటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ఇది కెసిఆర్, జగన్ ఇద్దరికీ వర్తిస్తుంది. సభకు ఎన్నికయ్యాక సమావేవాలకు హాజరు కావాల్సిందే. ప్రజల పక్షాన నిలబడాల్సిందే. అంతే తప్ప తమ మూర్ఖ వాదనలతో ప్రజలను చులకన చేయడం సరికాదు.

# మరో బాదుడుకు కేంద్రం సిద్ధం

## యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు విధించే యోచన




**న్యూఢిల్లీ, మార్చి 11:** యూపీఐ ఆధారిత డిజిటల్ చెల్లింపులు ఇప్పుడు అందరూ అలవాటు పడ్డారు. ప్రజలు నగదు లావాదేవీలను పక్కన పెట్టారు. మోడీ పిలుపుతో అంతా ఆన్‌లైన్‌లకు అలవాటు పడ్డారు. ప్రస్తుతం ఇలాంటి యూపీఐ, రూపే డెబిట్ కార్డులతో చేసే లావాదేవీలపై వ్యాపారులపై ఎలాంటి ఛార్జీల భారం లేదు. అయితే, త్వరలోనే ఈ లావాదేవీలపైనా మర్చెంట్ ఛార్జీలను విధించాలని కేంద్రం యోచిస్తున్నట్లు సమాచారం. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఇప్పటికే జీఎస్టీ తదితర భారాలు తప్పడం లేదు. బ్యాంకు లావాదేవీలపైనా భారం పడుతోంది. ఇవి చాలవన్నట్లుగా ఇప్పుడు యూపిఐ పేమెంట్లపై మోడీ దృష్టి పడిందని అర్థం చేసుకోవచ్చు. రానున్న రోజుల్లో పెద్ద వ్యాపారులు యూపీఐ ఆధారిత చెల్లింపులకు ఛార్జీలు చెల్లించే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తోందని కథనాలు పేర్కొన్నాయి. వార్షిక ఆదాయం రూ.40లక్షలపైన ఉండే వ్యాపారులకు యూపీఐ చెల్లింపులపై మర్చెంట్ డిస్కౌంట్ రేట్ ను తిరిగి తీసుకురావాలని ప్రతిపాదిస్తూ బ్యాంకింగ్ ఇండస్ట్రీ ప్రతినిధులు ఇటీవల కేంద్రానికి అధికారిక ప్రతిపాదన పంపారు. దీనిపై కేంద్రం సానుకూలంగా స్పందించిందని ఓ బ్యాంకర్ వెల్లడించినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. 'వీసా, మాస్టర్‌కార్డ్ వంటి డెబిట్ కార్డులు, ఇతర క్రెడిట్ కార్డులతో చేసే చెల్లింపులకు పెద్ద వ్యాపారులు ఎండీఆర్ ఛార్జీలు చెల్లిస్తున్నారు. అలాంటప్పుడు వారు యూపీఐ, రూపే డెబిట్‌కార్డు ఆధారిత లావాదేవీలకు ఎందుకు ఛార్జీలు కట్టకూడదు?' అని సదరు బ్యాంకర్ ప్రశ్నించారు. కేంద్రం కూడా ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుందని తెలిపారు. అయితే, 'టైర్డ్ ప్రైజింగ్ సిస్టమ్' ఆధారంగా ఈ లావాదేవీలపై ఛార్జీలు విధించాలని కేంద్రం యోచిస్తున్నట్లు సమాచారం. అంటే.. రూ.40లక్షల్లోపు వార్షికాదాయం ఉండే వ్యాపారులు యూపీఐ చెల్లింపులను ఉచితంగానే స్వీకరించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ ఛార్జీలను తిరిగి తీసుకురావడం వల్ల యూజర్లపై నేరుగా ఎలాంటి ప్రభావం ఉండబోదని తెలుస్తోంది. ఎందుకంటే ఈ లావేదేవీల కోసం యూజర్ల నుంచి ఎలాంటి ఛార్జీలు వసూలు చేయబోరు. కాకపోతే దీనివల్ల వ్యాపారులు మళ్లీ నగదు చలామణికి మొగ్గు చూపే అవకాశాలున్నాయని ఆర్థిక నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. మూడేళ్ల ముందు వరకు యూపీఐ ఆధారిత చెల్లింపులకు వ్యాపారులు కొంతమొత్తం ఛార్జీలను బ్యాంకులకు కట్టాల్సి వచ్చేది. ఆయా లావాదేవీలను ప్రాసెస్ చేసేందుకు ఈ రుసుము చెల్లించేవారు. అది కూడా ఒక శాతం లోపే ఉండేది. అయితే, యూపీఐ చెల్లింపులపై ఈ ఎండీఆర్ ఛార్జీలను 2022లో కేంద్రం తొలగించింది. అనంతరం ఈ ప్రాసెసింగ్ ఖర్చులను భర్తీ చేసేందుకు బ్యాంకులు, ఫిన్‌టెక్ కంపెనీలకు కేంద్రం సబ్సిడీలు ఇస్తూ వస్తోంది. అయితే, ఈ ఏడాది బడ్జెట్‌లో ఈ సబ్సిడీని రూ.3500 కోట్ల నుంచి రూ. 437 కోట్లకు తగ్గించారు.

# పాక్‌లో ప్రయాణికులతో రైలు హైజాక్

## బలూచీ తీవ్రవాదుల దుశ్చర్య.. • సైనిక చర్యకు దిగితే ప్రయాణికులను లేపేస్తామని హెచ్చరిక




**లాహోర్, మార్చి 11:** పాకిస్థాన్‌లో రైలు హైజాక్‌కు గురైన ఘటన కలకలం సృష్టిస్తోంది. బలోచిస్థాన్ ప్రావిన్స్‌లోని వేర్పాటువాదులు ప్రయాణికుల రైలుపై దాడి చేశారు. వందల మందికి పైగా ప్రయాణికులను బందీలుగా తీసుకున్నామని ప్రకటించుకున్నారు. బలోచిస్థాన్‌లోని క్వెట్టా నుంచి ఖైబర్ పఖ్తుంఖ్వాలోని పెషావర్‌కు రైలు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. పెషావర్ వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై వేర్పాటువాదులు భారీస్థాయిలో కాల్పులు జరిపారని బలోచిస్థాన్ ప్రభుత్వ ప్రతినిధి షాహిద్ రిండ్ వెల్లడించారు. ఈ ఘటన గురించి తెలియగానే అత్యవసర చర్యలు తీసుకోవాలని స్థానిక యంత్రాంగాన్ని ప్రభుత్వం ఆదేశించింది. వేర్పాటువాద మిలిటెంట్ గ్రూప్ బలోచ్ లిబరేషన్ ఆర్మీ ఈ దాడికి బాధ్యత ప్రకటించుకుంది. తాము బందీలుగా తీసుకున్నవారిలో భద్రతాసిబ్బంది కూడా ఉన్నారని తెలిపింది. పక్కా ప్లానింగ్‌తో ఆ గ్రూప్ రైల్వేట్రాక్‌ను పేల్చివేయడంతో జాఫర్ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయింది. దాంతో మిలిటెంట్లు వెంటనే రైలును తమ నియంత్రణలోకి తెచ్చుకున్నారు. ప్రయాణికులందరినీ బంధించారు. ఈ దాడిలో ఆరుగురు మిలిటరీ సిబ్బంది మృతి చెందినట్లు బీఎల్‌ఏ వెల్లడించింది. తమపై ఏదైనా మిలిటరీ ఆపరేషన్‌కు ప్రయత్నిస్తే.. ప్రయాణికులందరినీ చంపేస్తామని బెదిరించింది. ఈ ఘటనలో రైలు డ్రైవర్ గాయపడినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఘటనాస్థలానికి సహాయక, భద్రతా సిబ్బంది చేరుకున్నట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. బందీలను విడిపించేందుకు పాక్ భద్రతాబలగాలు యత్నిస్తున్నాయి. ఇదిలా ఉంటే.. బలోచిస్థాన్ వేర్పాటువాదులు పాక్‌లో వరుసగా దాడులకు పాల్పడుతున్నారు. పోలీస్ స్టేషన్లు, రైల్వేలైన్లు, వాహనాలపై దాడులు చేస్తున్నారు. సాయుధులు ప్రధాన హైవేను స్తంభింపజేసి బస్సులో నుంచి ప్రయాణికులను కిందకు దించి వారి గుర్తింపు కార్డులను చూసి మరీ కాల్చిచంపిన ఘటనలు చోటుచేసుకున్నాయి. బలోచ్ ప్రజల స్వయం నిర్ణయాధికారం, పాకిస్థాన్ నుంచి ప్రత్యేక ప్రాంత ఆవిర్భావాన్ని కోరుతూ బీఎల్‌ఏ 2000 సంవత్సరం ప్రారంభం నుంచి పాక్ సైన్యంపై దాడులకు పాల్పడుతోంది. పాక్‌తో పాటు అమెరికా, యూకే దీన్ని ఉగ్ర సంస్థగా ప్రకటించాయి. బలోచిస్థాన్ ప్రాంతం నైరుతి పాకిస్థాన్, ఆగ్నేయ ఇరాన్, దక్షిణ అఎ÷-గానిస్థాన్‌లలో వ్యాపించి ఉంది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చైనా-పాకిస్థాన్ ఆర్థిక నడవా బలోచిస్థాన్ ద్వారా వెళ్తుండటం ఈ దాడులకు ప్రధాన కారణం. ఆర్థిక వృద్ధికి సిపెక్ తోడ్పడుతుందని పాకిస్థాన్ ప్రభుత్వం ఆశిస్తుండగా.. తమ ప్రాంత వనరులను కొల్లగొట్టడానికి ఇదొక ఎత్తుగడ అని, దీనివల్ల తమకు ఎలాంటి ప్రయోజనం లేదని స్థానికులు భావిస్తున్నారు. సిపెక్‌కు సంబంధించిన ప్రాజెక్టులు, సిబ్బందిపై ముఖ్యంగా చైనీయులపై ఇటీవల దాడులు అధికమయ్యాయి. బలోచ్ వేర్పాటువాదాన్ని పాకిస్థాన్ ఉక్కుపాదంతో అణచివేస్తుండటంతో పరిస్థితులు మరింత జటిలంగా మారుతున్నాయి. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ లెక్కల ప్రకారం 2011 నుంచి దాదాపు పదివేల మంది బలోచ్ ప్రజలు అదృశ్యమయ్యారు.

# నిజామాబాద్ మార్కెట్‌కు పోటెత్తిన పసుపు

## గిట్టుబాటు ధరలు ఇవ్వడం లేదని రైతుల ఆందోళన

## 500 తగ్గించి కొనుగోలుకు వ్యాపారుల మెలిక

## చేసేది లేక ఆమోదించిన రైతులు



**నిజామాబాద్, మార్చి 10:** నిజామాబా ద్‌లోని మార్కెట్ యార్డుకు పసుపు పోటెత్తింది. 50 వేల బస్తాలకు పైగా అమ్మకానికి పసుపు రావడంతో రైతులతో మార్కెట్ యార్డ్ మొత్తం సందడిగా మారింది. కనీస మద్దతు ధరతో కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ.. రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. మార్కెట్ యార్డ్ ముట్టడించి అక్కడి నుంచి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ తీశారు. బస్టాండ్ ఎదుట రెండు గంటల పాటు ధర్నా చేపట్టారు. దీంతో నిన్న పసుపు కొనుగోళ్లు నిలిచి పోయాయి. జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో వ్యాపారులు రైతులతో జరిపిన చర్చల ముగిశాయి. కటాఫ్‌కు 500 ధర తగ్గిస్తే పసుపు యథావిధిగా కొనుగోలు చేస్తామంటూ వ్యాపారులు తేల్చి చెప్పడంతో చేసేదేమీ లేక రైతులు ఒప్పుకున్నారు. దీంతో.. క్వింటాకు 500 ధర తగ్గిస్తూ, క్వింటాల్ పసుపు 9500 రూపాయలకు కొనుగోలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే మార్కెట్ యార్డుకు పసుపు రైతులు పోటెత్తారు. పసుపు కొనుగోళ్లపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సీజన్ ప్రారంభం నుంచి క్వింటాల్‌కు 2 వేలకు పైగా ధర పతనం అయ్యిందని పసుపు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం క్వింటాల్‌కు రూ.18000 వరకు ధర పలుకగా.. ఈ సారి 10వేల లోపు కనీస ధర పలుకుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నాణ్యత వంకతో ధరలు తగ్గుతున్నాయని మార్కెట్ చైర్మన్ చెబుతుండటంపై రైతులు తప్పు పట్టారు. వ్యాపారులు, మార్కెట్ కమిటీ అధికారులు కుమ్మక్కయ్యారని రైతు సంఘాల నేతలు మండిపడుతున్నారు. పసుపునకు కనీస మద్దతు ధర చెల్లించాలని, దళారుల మోసాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిజామాబాద్ ప్రధాన బస్టాండ్ వద్ద పసుపు రైతులు మెరుపు ధర్నా చేపట్టారు. వరుసగా రెండోరోజూ మంగళవారం ఆందోళనకు దిగారు. పసుపు బోర్డు వచ్చినా లాభం లేకుండా పోయిందని అన్నారు. రైతులను ప్రభుత్వం మోసం చేస్తుందని, పసుపు బోర్డు పేరుతో దగా చేస్తున్నారని నినాదాలు చేశారు. కలెక్టర్ వచ్చి సమాధానం చెప్పేంతవరకు ధర్నాను విరమించబోమని మొండికేశారు. నిజామాబాద్ మార్కెట్ యార్డ్ మొత్తం దళారులు, వ్యాపారుల చేతిలో ఉందని ఆరోపించారు. రైతులకు మద్దతు ధర ఇవ్వకుండా వ్యాపారులు సిండికేట్ గా ఏర్పడి ధరలు నిర్ణయిస్తున్నారని, మార్కెట్లో వచ్చిన పసుపునకు నాణ్యత లేదని వంక చూపుతూ రైతును నిండా ముంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డుకు పసుపు తీసుకొచ్చి వారం రోజులు గడుస్తున్నా కూడా పసుపు కొనడం లేదని ఆరోపించారు. దిక్కుతోచని పరిస్థితుల్లో వ్యాపారులు చెప్పిన రేటుకు పసుపు విక్రయించి కన్నీటితో తిరిగి వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డులో వందల కుప్పల పసుపు ఉన్నప్పటికీ కేవలం ఒకటి, రెండు కుప్పలను పరిశీలిస్తున్నారని, పూర్తిస్థాయిలో పసుపు పరిశీలించకుండానే నాణ్యత లేదని వంకతో కొనడానికి ఎవరు ముందుకు రావట్లేదని అన్నారు.



# మెట్లు ఎక్కగానే ఇక అయ్యప్ప దర్శనం

## మార్పులకు శ్రీకారం చుట్టిన బోర్డు

## ఈనెల 15 నుంచి అమల్లోకి నిర్ణయం

**తిరువనంతపురం,మార్చి 11 :** శబరిమల అయ్యప్ప ఆలయంలోని సన్నిధానంలో 18 పవిత్ర మెట్లను అధిరోహించిన వెంటనే భక్తులు నేరుగా స్వామి దర్శనం అయ్యేలా మార్పులు చేయాలని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ) నిర్ణయించింది. ఈ మార్పును ఈ నెల 15 నుంచి 12 రోజుల పాటు విష్ణు పూజ జరిగే రోజుల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని టీడీబీ అధ్యక్షుడు పి.ఎస్.ప్రశాంత్ వెల్లడించారు. ఇది విజయవంతమైతే తదుపరి మండల మకరవిళక్కు సీజన్‌లోనూ దీన్ని కొనసాగిస్తామని తెలిపారు. మెట్లను ఎక్కిన వెంటనే ప్రస్తుతం భక్తులను ఒక వంతెన మీదికి మళ్లిస్తున్నామని అక్కడ వారు కొంత సమయం క్యూలో వేచి ఉండి అనంతరం స్వామి దర్శనం కోసం మరోవైపునకు వెళ్తున్నారని ప్రశాంత్ చెప్పారు. ఈ పద్ధతిలో భక్తులకు కేవలం ఐదు సెకన్ల వరకే దర్శనభాగ్యం దక్కుతోందన్నారు. భక్తులు మెట్లు ఎక్కిన వెంటనే దర్శనం చేసుకునేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కొత్త మార్పు కారణంగా ప్రతి భక్తునికి 20 నుంచి 25 సెకన్ల పాటు దర్శనం చేసుకునే వీలు కలుగుతుందన్నారు. అలాగే మెట్లు ఎక్కగానే స్వామి దర్శనం జరిగిందన్న అనుభూతి కూడా ఉంటుందని భావిస్తున్నారు. మెట్లు ఎక్కగానే దర్శనం కలగాలని మాలధారులు కూఆ కోరుకుంటున్నారు.

# ధర్మసమాజ్ పార్టీ గ్రామ కమిటీ ఎన్నిక



జనత న్యూస్, చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి గ్రామ ధర్మసమాజ్ పార్టీ కమిటీ నీ మంగళవారం ఎన్నుకున్నట్లు చిగురుమామిడి మండల అధ్యక్షుడు ఎనగందుల అనిల్ తెలిపారు. గ్రామ అధ్యక్షుడిగా వంతడుపుల హరీష్, ఉపాధ్యక్షుడిగా వంతడుపుల అరవింద్, ప్రధాన కార్యదర్శులు గా వంతడుపుల రాజేష్, గిరి, కార్యదర్శి గా ఎనగందుల విజయ్,కోశాధికారిగా వంతడుపుల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా బన్నీ తదితరులను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ మహనీయులు మహాత్మ జ్యోతిరావు పూలే, సాహు మహారాజ్,అంబేత్కర్ మాన్యవార్ కన్షిరాం ల ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. పార్టీ పటిష్టత కోసం పని చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జిల్లె ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలి

## తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ బాల నాగు




జనత న్యూస్, చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ డిజిటల్ సర్వీసేపై ఆర్ ఎం బడుగు బాలనాగు డిజిటల్ లావాదేవులపై మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద అవగాహన కల్పించారు. ఆన్లైన్ ద్వారా బ్యాంకు పొదుపులు, విత్ డ్రా లు, ఫోన్ పే, గూగుల్ పే వంటి లావాదేవీల పై ఖాతాదారులు వివరించారు. ప్రతి ఒక్కరూ ఏటీఎం మొబైల్ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు సైబర్ నేరగాళ్ల నుండి ఫోన్లు చేస్తూ బ్యాంకు మేనేజర్ నుండి ఫోన్ చేస్తున్నామని మీయొక్క పిన్ నెంబర్ చెప్పాలని ఫోన్ వస్తే అలాంటివి ఎవరూ కూడా నమ్మకూడదు అని బ్యాంకు నుండి ఖాతాదారులకి అలాంటి ఫోన్లు రావు అని తెలిపారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఖాతాదారులు పెట్టుబడులు పెట్టాలని, నమ్మకమైన బ్యాంకుగా ప్రజలు గుర్తింపు పొందిందని అన్నారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకులో వ్యవసాయ మార్టిగేజ్ లోన్స్ తో పాటు హౌసింగ్ లోన్ కూడా ఇస్తున్నాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంబి వి.వి కృష్ణ, ఇందుర్తి బ్రాంచ్ బ్యాంక్ మేనేజర్ అతుల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి సుమంత్, లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సీనియర్ జర్నలిస్టు గాదే రఘునాథరెడ్డి, మాజీ సర్పంచ్ పుల్లూరి రాజు, సిఏలు బుర్ర శోభ, కత్తి రమాదేవి, లక్ష్మి బ్యాంక్ సిబ్బంది మహిళా సంఘ సభ్య లు ఖాతాదారులు గ్రామస్తులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# రసకందాయంలో హుజురాబాద్ ప్రెస్ క్లబ్ రాజకీయం!

## నేడే హుజురాబాద్ ప్రెస్ క్లబ్ ఎన్నిక

(కోరెం సుధాకర్ రెడ్డి జనతా న్యూస్ ప్రతినిధి హుజురాబాద్)

హుజురాబాద్ ప్రెస్ క్లబ్ ఎన్నికలు బుధవారం జరగనున్నాయి. మొన్నటిదాకా ప్రెస్ క్లబ్ అడ్హాక్ కమిటీ కన్వీనర్ గా ఉన్న గడ్డం ధర్మారెడ్డి (ఆంధ్రజ్యోతి ఆర్సీ ఇంచార్జ్) రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. స్థానిక పాత్రికేయులు ప్రెస్ క్లబ్ ఎన్నికల అంశాన్ని జిల్లా, రాష్ట్ర టి యు డబ్ల్యూ జే ప్రతినిధులకు, కార్యవర్గానికి వివరించగా.. వారు ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తోంది. బుధవారం జరిగి ఎన్నికకు కరీంనగర్ నుండి టియుడబ్ల్యూజే ప్రతినిధులు హాజరుకానున్నారు. అధ్యక్ష పదవికి కాయిత రాములు, నిమ్మటూరి సాయి కృష్ణ పోటీ పడుతుండగా, ప్రధాన కార్యదర్శి పదవికి పబ్బ తిరుపతి, కామని రవీందర్ పోటీ పడుతున్నట్టు తెలుస్తోంది. ఎన్నికను ఏకగ్రీవంగా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్టు సమాచారం. ప్రెస్ క్లబ్ ఎన్నిక నేపథ్యంలో స్థానిక పాత్రికేయల్లో ఉత్కంఠ నెలకొంది. ఒకవైపు పాత్రికేయుల నివాస స్థలాల సమస్య సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న నేపథ్యంలో ప్రెస్ క్లబ్ ఎన్నిక జరుగుతుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఎన్నికల్లో పోటీ చేస్తున్న సభ్యులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. వ్యూహ ప్రతి వ్యూహాలతో పెద్ద ఎత్తున సమీకరణలు చేస్తున్నారు. మధువని గార్డెన్లో ప్రెస్ క్లబ్ ఎన్నిక జరగనుంది. సీనియర్ పత్రికేయులు తిరునగరి ఆంజనేయస్వామి, మామిడి రవీందర్, గడ్డం ధర్మారెడ్డి, అల్లి నరేందర్ తదితరులు ప్రెస్ క్లబ్ ఎన్నికలు సామరస్య వాతావరణంలో జరిగేందుకు సమన్వయం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన హుజురాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష పదవి ఎవరికి దక్కుతుందనే విషయమై ఉత్కంఠ నెలకొంది.

# దటేజ్ నేరెళ్ల శారద

**ఎంజెపి స్కూల్ ఆకస్మిక తనిఖీ**

**రికార్డులు క్షుణ్ణంగా పరిశీలన**

**విద్యార్థులతో మాట్లాడి భరోసా కల్పన -**

**ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలన్న మహిళా కమిషన్**

**మనస్సాక్షితో పనిచేయాలని**

**సూచించిన శారద**



**తిమ్మాపూర్, జనతా న్యూస్ :** నేరెళ్ల శారద రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్. మొన్నటి వరకు ప్రైవేటు ఇంటర్ కళాశాలలతో పాటు ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసి గడగడలాడించిన ఆమె ఎక్కడికి వెళ్లినా తనదైన ముద్ర వేసుకుంటుంది. చెప్పకుండానే వెళ్లి అక్కడున్న ఉద్యోగులకు

ముచ్చెమటలు పట్టిస్తోంది. మంగళవారం మధ్యాహ్నం తిమ్మాపూర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి సుమారు నాలుగు గంటల పాటు అక్కడే ఉండి అన్నిటిని క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడే ఉన్న అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థులతో మాట్లాడారు. అక్కడున్న ఉద్యోగులకు ముచ్చమటలు పట్టించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకొని పరిష్కారం చేస్తానంటూ భరోసాను కల్పించారు.

తిమ్మాపూర్ లోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలను మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. మొదట పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించిన ఆమె వంటగదిని, డైనింగ్ హాల్ ని, వంటలను, సరుకులున్న గదులను పరిశీలించారు. విద్యార్థుల వసతి గృహాన్ని, టాయిలెట్స్ ని పరిశీలించిన ఆమె విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. టీచర్లు లేకుండా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న కాస్మోటిక్ చార్జీలు అందుతున్నాయా లేదా అనే విషయంపై ఆరా తీశారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి మాట్లాడి కాస్మోటిక్ ఛార్జీలు ఎంత అందినాయి, ఎప్పుడు అందినాయో అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నీటి సమస్య ఉందని, కోతుల, కుక్కల బెడద ఉందని, ఫ్యాన్లు తిరగడం లేదని విద్యార్థులు తెలిపారు. ఉదయం టిఫిన్ సమయంలో మెనూ పాటించడం లేదని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. అందరికీ టేబుల్స్ సరిపడక భోజన సమయంలో బయటనే కూర్చోవలసి వస్తుందని విద్యార్థులు ఆమెకు చెప్పారు.

విద్యార్థులతో మాట్లాడిన అనంతరం ఆమె ప్రిన్సిపాల్ సరితతో పాటు సిబ్బందితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పై తనకు అందిన ఫిర్యాదులు పై ఆమె ఆరా తీశారు. డబ్బులు తీసుకుని సీట్లు ఇచ్చారంటూ విద్యార్థులకు, అందాల్సిన సరుకులు బయటకు వెళ్తున్నాయంటూ ఫిర్యాదు అందినట్లు ఆమె చెప్పారు. విద్యాబోధన బాగున్న, విద్యార్థులకు టిఫిన్ మెనూ ప్రకారం అందించకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజిస్టర్ ప్రకారం కాకుండా సరుకులు ఎక్కువగా ఉండటంపై ఆమె ఆరా తీశారు. దీనిపై పూర్తిస్థాయిలో వివరణ ఇవ్వాలని ప్రిన్సిపాల్ ని ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడిన అనంతరం రికార్డులను, సరుకులను పరిశీలించిన ఆమె పలు లోపాలు ఉన్నాయని గుర్తించి, వాటిని వెంటనే సవరించుకోవాలని, త్వరలోనే మరోసారి వచ్చి తనిఖీ చేస్తానని సూచించారు. హాస్టల్ గదుల్లో బూజును తొలగించాలని సిబ్బందికి సూచించారు.

### మనస్సాక్షితో పని చేయండి...

గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి మనస్సాక్షితో పని చేయాలని, అప్పుడే మీ కుటుంబానికి మంచి జరుగుతుందని మహిళా కమిషన్ చైర్పర్సన్ నేరెళ్ల శారద ఉద్యోగులకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఫలాలు విద్యార్థులకు అందిస్తూ నాణ్యమైన విద్యను అందించినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని ఆమె తెలిపారు. ప్రభుత్వపరంగా విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందుతున్నాయా? ఏమైనా లోపాలు ఉన్నాయా..., ప్రభుత్వపరంగా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా, విద్యార్థులకు సక్రమంగా మెనూ అందుతుందా, కాస్మెటిక్ ఛార్జీలు అందుతున్నాయా, లేదా తెలుసుకోవడానికి తాను ఆకస్మిక తనిఖీ చేపట్టినట్లు నేరెళ్ల శారదా తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సక్రమంగా అందించాలని, వీటిలో ఉద్యోగులు కక్కుర్తి పడవద్దని, అక్రమాలకు పాల్పడవద్దని సూచిస్తూ ప్రభుత్వం జీతం ఇస్తుందని సక్రమంగా పనిచేసుకోవాలని సూచించారు. టీచర్లు ఎక్కడ కనిపించినా విద్యార్థులు ప్రేమతో వచ్చి మాట్లాడేలా ఉండాలన్నారు. డైనింగ్ సమయంలో విద్యార్థులు అంతా ఒకేసారి రావడంతో టేబుల్స్ సరిపడక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బ్యాచిలవారీగా విభజించి డైనింగ్ వచ్చేలా చూడాలని ఆమె ప్రిన్సిపాల్ కి సిబ్బందికి సూచించారు.






# తాగు నీటి సమస్యలు పరిష్కారిస్తాం

## తహసిల్దార్ ముద్దసాని రమేష్

జనత న్యూస్, చిగురుమామిడి: రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు మండల అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా సుందరగిరి గ్రామంలో గత రెండు సంవత్సరాలుగా పనిచేయకుండా ఉన్న రక్షిత మంచినీటి బావి మోటర్ మరమ్మతులు పూర్తిచేశారు..తహసీల్దారు, గ్రామ స్పెషల్ ఆఫీసర్ ముద్దసాని రమేష్ అదేశాలతో గ్రామపంచాయతీ కార్యదర్శి గోదారి అజయ్ కుమార్ తక్షణమే చర్యలు చేపట్టి, చెడిపోయిన మోటార్‌ను రిపేర్ చేయించి గ్రామ ప్రజలకు తాగునీటి సౌకర్యాన్ని అందించారు. అంతేగాక, గత వారం రోజులుగా గ్రామంలో ఉన్న మిషన్ భగీరథ గేట్ వాల్వ్ లీకేజీల సమస్యను గుర్తించి మరమ్మతులు పూర్తి చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ... వేసవి కాలంలో ప్రజలకు ఎలాంటి నీటి సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు.గ్రామంలోని గేట్వాల్వ్ మరమ్మత్తులు, నీటి సమస్యను పరిష్కారమవడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ, సమస్యను వెంటనే పరిష్కరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



# గ్రూప్ -2లో నిఖిల్ రెడ్డికి 70వ ర్యాంక్

## నిఖిల్ రెడ్డికి అభినందనల వెల్లువ



హుజురాబాద్ మార్చి 11 జనతా న్యూస్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మంగళవారం విడుదల చేసిన గ్రూప్-2 ఫలితాల్లో హుజురాబాద్ కు చెందిన సంతపురి నిఖిల్ రెడ్డి 70వ ర్యాంకు (హాల్ టికెట్ నం.70 2281826033) సాధించాడు. సైదాపూర్ మండలం ఎక్లాస్ పూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సంతపురి నాగిరెడ్డి, జ్యోతి దంపతుల కుమారుడైన నిఖిల్ రెడ్డి ప్రస్తుతం కరీంనగర్ జిల్లా ట్రెజరీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్నాడు. హుజురాబాద్ పట్టణంలోని టెట్రా హెడ్రాన్ హై స్కూల్లో పదో తరగతి వరకు, హైదరాబాద్ నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, అనంతరం హైదరాబాద్ శ్రీనిధి ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. బాల్యం నుండే చదువులో చురుగ్గా ఉండే నిఖిల్ లో దాగున్న సామర్థ్యాన్ని గుర్తించిన తండ్రి నాగిరెడ్డి పోటీ పరీక్షల వైపుగా ప్రోత్సహించాడు. ఏ విధమైన కోచింగ్ లేకుండానే ఇంటి వద్దనే పరీక్షల కోసం సన్నద్ధుడయ్యాడు. మొదట గ్రూప్ -4లో ఆరో ర్యాంకు సాధించి పోలీస్ శాఖలో, రెండోసారి గ్రూప్ -4 ఈడో ర్యాంకు సాధించి లో ట్రెజరీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా ఎంపికై కరీంనగర్లో విధులు నిర్వహిస్తున్నారు. తాజాగా గ్రూప్ 2 లో 423 మార్కులతో రాష్ట్రంలోనే 70 ర్యాంకు సాధించాడు. భవిష్యత్తులో గ్రూప్ 1 కూడా సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు నిఖిల్ తెలిపాడు. తల్లిదండ్రులు, గురువుల ప్రోత్సాహంతోనే తను ర్యాంక్ సాధించానని వివరించాడు. నిఖిల్ రెడ్డికి తహసిల్దార్ ఉద్యోగం వచ్చే అవకాశం ఉంది. చిన్న వయసులోనే రెండుసార్లు గ్రూప్ 4 ఒకసారి గ్రూప్ 2 సాధించిన నిఖిల్ ను పలువురు అభినందిస్తున్నారు. నిఖిల్ రెడ్డి గ్రూప్ -2 లో 70 వ ర్యాంక్ సాధించడం ఎంతో ఆనందంగా ఉందని అతని తండ్రి నాగిరెడ్డి, నిఖిల్ రెడ్డి సోదరి నిఖిల అన్నారు. గ్రూప్ 2 స్థాపించిన నిఖిల్ రెడ్డిని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, ఉపాధ్యాయులు బొద్దిరెడ్డి దయాకర్ రెడ్డి, మహ్మద్ కరీం, పులి అశోక్ రెడ్డి, వేముగంటి ప్రవీణ్ కుమార్, విడపు శ్రీనివాస్, పోలంపల్లి ఆదర్శన్ రెడ్డి, కడవేరుగు సత్యం, టెట్రా హెడ్రాన్ స్కూల్ డైరెక్టర్లు ముచ్చ నారాయణరెడ్డి, కోరెం సంజీవరెడ్డి, సుంకిశాల సంతోష్ రావు, రాజిరెడ్డి, పారిశ్రామికవేత్త వర్దినేని రవీందర్ రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ వద్లూరి విజయ్ కుమార్, తదితరులు అభినందించారు.

## డ్రైవర్‌ను తొలగించారనే కక్షతో
# పాఠశాలపై బాంబు దాడి



**పట్నా :** బస్సు డ్రైవర్‌ను తొలగించారనే కక్షతో దిల్లీ పబ్లిక్ స్కూల్‌పై రాళ్లు, బాంబు లతో గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసు లు తెలిపిన వివరాల ప్రకా రం... బిహార్‌లోని హాజీపుర్ లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌పై గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లు, బాంబులతో దాడి చేశారు. దీనిపై పాఠశాల యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో స్కూల్ వెలుపల ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డ్ అయిన దృశ్యాల ఆధారంగా కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని పోలీసులు తెలిపారు. ఇటీవల ఓ డ్రైవర్‌ను విధుల నుంచి తొలగించడంతో అతడే ఈ దాడికి పాల్పడి ఉంటాడని పాఠశాల యాజమాన్యం అనుమానం వ్యక్తంచేయడంతో ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు. ఈ దాడికి సంబంధించిన దృశ్యాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అవి వైరల్‌గా మారాయి.



## నదుల వద్ద సబ్బుల విక్రయాలు బంద్..
### కర్ణాటక సర్కారు నిర్ణయం

**బెంగళూరు :** నదులు, సరస్సుల వద్ద కాలుష్యాన్ని నివారించేందుకు కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వాటికి 500 మీటర్ల పరిధిలో సబ్బులు, షాంపుల విక్రయాలపై నిషేధం విధిస్తూ రాష్ట్ర పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర్ కండ్రే ఆదేశాలు జారీ చేశారు. అధికారులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ..'యూజ్ అండ్ త్రో సంస్కృతి' ప్రబలంగా ఉందన్నారు. "దేవాలయాల సమీపంలోని నదులను సందర్శించే భక్తులు స్నానాలు ఆచరిస్తారు. షాంపూ ప్యాకెట్లు, వాడేసిన సబ్బులు వాటివద్ద వదిలేస్తారు. ఆధ్యాత్మిక ప్రాంతాల్లోని నది, సరస్సు, ఇతర నీటి వనరులకు 500 మీటర్ల దూరంలో సబ్బులు, షాంపూ, కాలుష్యానికి కారణమయ్యే ఇతర వస్తువుల విక్రయాలు చేపట్టకుండా చూడాలి. అదేవిధంగా భక్తులు తమ దుస్తులను నీటిలో వదిలేయకుండా చర్యలు తీసుకోవాలి" అని ఆదేశించారు.

## నా భర్త చావుకు పని ఒత్తిడే కారణం
### జీఎస్టీ అధికారి భార్య



**నోయిడా:** ఉత్తరప్రదేశ్‌లో జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చర్చనీయాంశంగా మారింది. తన భర్త మృతిపై తాజాగా అధికారి భార్య స్పందించారు. పని ఒత్తిడి కారణంగానే ఆయన ప్రాణాలు కోల్పోయారని.. ఈ వ్యవస్థ తన భర్తను బలి తీసుకుందని ఆరోపించారు. నోయిడాలో కుటుంబంతో కలిసి నివాసముంటున్న జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ సంజయ్ సింగ్ (59) ఘజియాబాద్‌లో పని చేస్తు న్నారు. సోమవారం ఆయన ఆత్మహ త్యకు పాల్పడ్డారు. తాను ఉంటున్న అపార్ట్‌మెంట్‌లో 14వ అంతస్తు నుంచి కిందకి దూకేశారు. దీంతో ఆయన ప్రాణాలు కోల్పోయారు. ఆయన ఐదేళ్లుగా క్యాన్సర్‌తో పోరాడుతున్నారని.. ఈ క్రమంలోనే అధికారి మానసిక కుంగుబాటుకు లోనయ్యారని పోలీసులు తెలిపారు. ఆ బాధే ఆయనను ఆత్మహత్యకు పాల్పడేలా చేసిందని పేర్కొన్నారు. తాజాగా ఆయన సతీమణి మీడియాతో మాట్లాడారు. తన భర్త మరణానికి కారణం క్యాన్సర్ కాదని తెలిపారు. "ఆయన ఏళ్లుగా క్యాన్సర్‌తో పోరాడుతున్నారు. కానీ, దానిని ఎప్పుడో జయించారు. మా బంధువులోని ఒక డాక్టర్ ఆయనకు చికిత్స అందించారు. ప్రస్తుతం ఆయనకు దానిగురించి ఎలాంటి బాధ లేదు. అయితే.. నా భర్త ఎప్పుడూ పని ఒత్తిడికి గురయ్యేవారు. దీని గురించి ఆయన సహోద్యోగులకు తెలిసే ఉంటుంది. పని ఒత్తిడి కారణంగా ఆయన బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ వ్యవస్థ నా భర్తను బలి తీసుకుంది" అంటూ ఆమె విలపించారు. ఇటీవల దిల్లీలోనూ విదేశీ వ్యవహారాల శాఖ(ఎంఈఏ)కు చెందిన ఐఎఫ్ఎస్ అధికారి బలవన్మరణానికి పాల్పడ్డారు. చాణక్యపురి ప్రాంతంలోని ఎంఈఏ సొసైటీలో తాను నివాసం ఉంటున్న భవనంలోని నాల్గవ అంతస్తు నుంచి కిందకు దూకి ఆయన ప్రాణాలు తీసుకున్నారు. 2011 బ్యాచ్‌కు చెందిన ఆయన కొంతకాలంగా కుంగుబాటుతో బాధపడుతున్నారని, చికిత్స కూడా తీసుకుంటున్నారని అధికారులు వెల్లడించారు. ఆయన మృతికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ క్రమంలోనే జీఎస్టీ అధికారి ఆత్మహత్య చేసుకోవడంతో.. వర్క్- లైఫ్ బ్యాలెన్స్‌పై తీవ్ర చర్చ జరుగుతోంది.

## చైనా బయటే నా వారసుడు జన్మిస్తాడు : దలైలామా



**చైనా :** చైనా బయటే తన వారసుడు జన్మిస్తాడని టిబెట్ బౌద్ధగురువు దలైలామా పేర్కొన్నారు. ఆయన కొత్తగా రాసిన పుస్తకంలో ఈ విషయాన్ని వెల్లడించారు. దీంతో దాదాపు ఆరు దశాబ్దాలుగా టిబెట్ నియంత్రణపై చైనాతో ఆయనకు వివాదం ఉన్న విషయం తెలిసిందే. తన తర్వాత దలైలామా వారసత్వం కొనసాగాలని ఆయన రాసిన వాయిస్ ఫర్ ది వాయిస్‌లెస్‌లో కోరారు. నేడు విడుదల కానున్న ఈ పుస్తకాన్ని ఓ ఆంగ్ల వార్తా సంస్థ సమీక్షించింది. గతంలో ఓ సందర్భంలో దలైలామా మాట్లాడుతూ తన తర్వాత ఈ పరంపర ముగిసిపోవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. కానీ, తాజా పుస్తకంలో మాత్రం చైనా బయట పుడతారని పేర్కొన్నారు. తన పునర్జన్మ టిబెట్ బయట జరగొచ్చని.. అది భారత్‌లో కూడా కావచ్చని ఆయన పేర్కొన్నారు. "పూర్వీకుల పనిని ముందుకు తీసుకెళ్లటానికి ఉద్దేశించిందే పునర్జన్మ. కొత్త దలైలామా చైనా బయట స్వేచ్ఛా ప్రపంచంలో జన్మిస్తాడు. అందుకే తన బాధ్యత అయిన విశ్వకరుణకు గొంతుకగా ఉంటారు" అని పేర్కొన్నారు. 14వ దలైలామాగా మారిన టెంజియన్ గ్యాట్సో 23వ ఏటే టిబెట్ నుంచి భారత్‌కు వలసవచ్చారు. నాడు తమ ప్రాంతాన్ని ఆక్రమించిన చైనాకు వ్యతిరేకంగా ఆయన గళం విప్పారు. టిబెట్ వాదాన్ని సజీవంగా ఉంచినందుకు ఆయనకు 1989లో నోబెల్ శాంతి బహుమతి వచ్చింది. తన వారసుడిగా చైనా ప్రకటించే వ్యక్తికి ఎటువంటి గౌరవం లభించదని వెల్లడించారు.

## శాంతి ఒప్పందంలో ఉక్రెయిన్
# భూమిని వదులుకోవాల్సిందే : అమెరికా

**ఉక్రెయిన్ :** శాంతి ఒప్పందం కోసం 2014 తర్వాత రష్యా ఆక్రమించుకొన్న భూమిపై ఉక్రెయిన్ ఆశలు వదులుకోవాల్సిందేనని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో తేల్చిచెప్పారు. అప్పుడే సంధి జరిగి యుద్ధం ఆగుతుందన్నారు. శాంతిచర్చల కోసం ఉక్రెయిన్ అధికారులతో మాట్లాడేందుకు సౌదీ అరేబియా రాజధాని జెడ్డాకు చేరుకున్న సందర్భంగా మార్కో రూబియో ఈ వ్యాఖ్యలు చేశారు. శ్వేతసౌధంలో ట్రంప్-జెలెన్‌స్కీల మధ్య వాగ్వాదం చోటుచేసుకొన్న 10 రోజుల తర్వాత ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం. ఇప్పటికే ట్రంప్ ప్రభుత్వం ఉక్రెయిన్‌కు సైనిక సాయం, ఇంటెలిజెన్స్ సమాచారం నిలిపివేసింది. రూబియో విలేకర్లతో మాట్లాడుతూ "ఉక్రెయిన్ శాంతి ఒప్పందం కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకొంటుందన్న అంచనాలతోనే నేను ఇక్కడికి వచ్చాను. అదే సమయంలో యుద్ధం ముగించాలంటే రష్యా కూడా కొన్ని పనులు చేయాల్సిఉంటుంది. ఇరుపక్షాలు ఓ అవగాహనకు రావాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత పరిస్థితికి సైనిక పరిష్కారం లేదు. ఇక ఉక్రెయిన్ మొత్తాన్ని రష్యా ఆక్రమించలేదు. అదే సమయంలో 2014 నాటి స్థితికి రష్యాను ఉక్రెయిన్ చేర్చలేదు" అని పేర్కొన్నారు. అంతకుమించి ఒప్పందం వివరాలను మాత్రం ఆయన వెల్లడించేందుకు నిరాకరించారు. ఇక ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా జెడ్డా చేరుకొన్నారు. ఆయన సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్‌తో భేటీ అయ్యారు. ఈసందర్భంగా యుద్ధ ఖైదీల విడుదలకు ఆయన సంసిద్ధత వ్యక్తంచేశారు.



### కర్స్క్ ప్రాంతంలో రష్యా దూకుడు..

ఉక్రెయిన్ స్వాధీనం చేసుకొన్న కర్స్క్ ప్రాంతాన్ని రష్యా దళాలు తిరిగి స్వాధీనం చేసుకోవడం మొదలుపెట్టాయి. అమెరికా నుంచి సైనిక, ఇంటెలిజెన్స్ సాయం నిలిచిపోవడంతో మాస్కో సేనలు రెట్టించిన ఉత్సాహంతో దాడులు చేస్తున్నాయి. వీటికితోడు ఉత్తరకొరియా దళాలు కూడా గత కొన్ని రోజులుగా ఇక్కడ పలు ఉక్రెయిన్ స్థావరాలను స్వాధీనం చేసుకొన్నాయి. కీవ్ నుంచి ఈ ప్రాంతానికి వస్తున్న కీలక వస్తువుల సరఫరాను తరలించేందుకు ఉపయోగించే రోడ్డును స్వాధీనం చేసుకొనేందుకు రష్యా సేనలు యత్నిస్తున్నాయి. ఇప్పటికే ఆ ప్రాంతంలో ఉన్న ఉక్రెయిన్ సేనలను మాస్కో దళాలు చుట్టుముట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, ఈ ప్రచారాన్ని ఉక్రెయిన్ సైన్యం తిరస్కరిస్తోంది. దలైలామా ప్రస్తుతం భారత్‌లోని ధర్మశాలలో ఆశ్రయం పొందుతున్నారు. ఆయన అక్కడి నుంచే తన వారసుడిని ఎంపిక చేయనున్నారు. ఇది చైనాకు గిట్టక తన గడ్డపైనే వారసుడిని గుర్తించాలంటోంది. టిబెటన్ బౌద్ధుల దృష్టిలో దలైలామా తరవాత రెండో స్థానం పాంచెన్ లామాది. ఈ పదవికి దలైలామా ఎంపిక చేసిన బాలుడిని కాదని చైనా తనే ఒక బాలుడిని నియమించినా, టిబెటన్ల ఆమోదం పొందడంలో అతడు విఫలమయ్యాడు. ఈ నేపథ్యంలో ఇప్పుడు కొత్త వారసుడి ఎంపికపై ఆసక్తి నెలకొంది.

## ఐసీసీ ఆదేశాలతో ఫిలిప్పీన్స్ మాజీ అధ్యక్షుడి అరెస్ట్




అంతర్జాతీయ నేర న్యాయస్థానం (ఐసీసీ) వారెంట్ మేరకు ఫిలిప్పీన్స్ మాజీ అధ్యక్షుడు రోడ్రిగో డ్యూటెర్టోను పోలీసు అధికారులు అరెస్టు చేశారు. ఆ దేశ రాజధాని మనీలాలో అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ పరిణామాలు చోటుచేసుకొన్నాయి. డ్యూటెర్టో హాంకాంగ్ నుంచి స్వదేశానికి చేరుకోగానే అరెస్ట్ చేశారు. ఆయన చేపట్టిన మాదక ద్రవ్యాలపై యుద్ధంలో వేల మంది మరణించారు. దీనిలో మానవహక్కుల ఉల్లంఘనలు చోటుచేసుకొన్నాయన్న ఆరోపణలున్నాయి. దీనికి సంబంధించే అంతర్జాతీయ నేర న్యాయస్థానం విచారణ చేపట్టింది. ఈ కేసుపై గతంలోనే డ్యూటెర్టో స్పందిస్తూ.. ఐసీసీ తనపై వారెంట్ జారీ చేస్తూ.. అరెస్టుకు సిద్ధంగా ఉండమని ప్రకటించింది. అదే సమయంలో తాను మాదక ద్రవ్యాల వ్యాపారాన్ని అణచివేయడాన్ని సమర్థించుకొన్నారు. డ్రగ్స్‌తో సంబంధం ఉన్నవారిని చంపేయమని తాను ఆదేశించినట్లు వస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. ఈ అరెస్టుపై ఆ దేశ అధ్యక్ష కార్యాలయం స్పందిస్తూ ఇప్పటికే వారెంట్ కాపీని పోలీసులు డ్యూటెర్టోకు అందజేసినట్లు వెల్లడించింది. మాజీ అధ్యక్షుడు వారి కస్టడీలో ఉన్నట్లు పేర్కొంది. ఇక ఆయన తరపున లాయర్ సాల్వడోర్ పనెలో స్పందిస్తూ.. ఈ అరెస్టు అన్యాయమని పేర్కొన్నారు. ఆయనతో పాటు న్యాయవాదిని అనుమతించలేదన్నారు. డ్యూటెర్టో 2019లో అధికారంలో ఉన్న వేళ ఐసీసీ ఫిలిప్పీన్స్‌లో మానవహక్కుల ఉల్లంఘనలు, హత్యలపై దర్యాప్తు మొదలుపెట్టింది. దీంతో ఫిలిప్పీన్స్ ఐసీసీ నుంచి వైదొలగింది. గతేడాది వరకు ఈ దర్యాప్తునకు సహకరించేందుకు ఆ దేశం నిరాకరించింది. ఇక తాను దావౌ నగర మేయర్‌గా ఉన్న సమయంలో నగరంలోని నేరాలను అణచివేయడానికి తన అధీనంలో ఓ డెత్‌స్క్వాడ్ ఉండేదని కొన్నాళ్ల క్రితం రోడ్రిగో డ్యూటెర్టో అంగీకరించారు. 2016లో ఆయన దేశాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తాను దావౌ నగరంలో చేసిందే.. దేశం మొత్తం అమలుచేస్తానని ఆయన వాగ్దానం చేశారు. ఈసందర్భంగా రోడ్రిగో మాట్లాడుతూ అనుమానితులను రెచ్చగొట్టి వారు తిరగబడేలా చేయమని తానే పోలీసు అధికారులకు చెప్పానని.. అప్పుడే వారు చేసే ఎన్‌కౌంటర్లను తగిన సాకులు లభిస్తాయని సూచించినట్లు వెల్లడించారు. తాను చేసిన పనులకు ఎలాంటి క్షమాపణలు చెప్పనని తేల్చి చెప్పారు. ఆయన చేపట్టిన 'మాదక ద్రవ్యాలపై యుద్ధం' కారణంగా దేశవ్యాప్తంగా పోలీస్ ఆపరేషన్లలో వేల మంది అనుమానాస్పద స్థితిలో మరణించారు. ప్రస్తుతం దానిని ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు విచారిస్తోంది.

## అమెరికాలో పాకిస్థాన్ రాయబారి బహిష్కరణ



దేశీయంగా ఉద్యోగాల కోత, విదేశాలపై సుంకాల విధింపుతో దూకుడుగా వ్యవహరిస్తోన్న అమెరికా.. పాకిస్థాన్, అఫ్గానిస్థాన్‌లపై ట్రావెల్ బ్యాన్ విధించే అవకాశం ఉన్నట్లు ఇటీవల పలు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఈనేపథ్యంలో ఓ కీలక విషయం వెలుగులోకి వచ్చింది. తుర్క్‌మెనిస్థాన్‌లో పాకిస్థాన్ రాయబారిగా వ్యవహరిస్తున్న ఎసాన్‌కు యూఎస్‌లోకి అనుమతి నిరాకరించి.. వెనక్కి పంపినట్లు తెలుస్తోంది. ఎసాన్ సరైన పత్రాలతో అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌కు వెళ్తుండగా యూఎస్ ఇమిగ్రేషన్ అధికారులు ఆయనను విమానాశ్రయంలో ఆపినట్లు అంతర్జాతీయ మీడియాలు వెల్లడించాయి. అయితే ఆయన వీసాలో 'వివాదాస్పద ప్రస్తావనలు' ఉన్నట్లు యూఎస్ ఇమిగ్రేషన్ వ్యవస్థ గుర్తించడంతో ఆయనను బహిష్కరించినట్లు పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ పేర్కొన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు చేయాలని లాస్ ఏంజెలెస్‌లోని తన కాన్సులేట్‌ను ఆదేశించినట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలుసుకోవడానికి ఎసాన్‌ను ఇస్లామాబాద్‌కు పిలిపించే అవకాశం ఉందని అన్నారు. కాగా ఈ ఘటనపై అమెరికా పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది. అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన ట్రంప్.. పలు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకాలు చేసిన విషయం తెలిసిందే. ఇందులోభాగంగా అమెరికాలోకి ప్రవేశించే విదేశీయుల నుంచి జాతీయ భద్రతా ముప్పు పొంచివుందా అన్న విషయాన్ని ముందే గుర్తించే కార్యనిర్వాహక ఆదేశం పైనా సంతకం చేశారు. దీని ప్రకారం, పాక్షికంగా లేదా పూర్తిగా ప్రయాణ నిషేధం విధించాల్సిన దేశాల జాబితాను రూపొందించి మార్చి 12లోగా సమర్పించాలని కేబినెట్ సభ్యులను ఆదేశించారు. పూర్తిగా నిషేధం కోసం సిఫార్సు చేసిన జాబితాలో అఫ్గానిస్థాన్ ఉన్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ జాబితాలో పాకిస్థాన్‌ను కూడా చేర్చనున్నట్లు సమాచారం.

## మాస్కోపై ఉక్రెయిన్ ప్రతీకార దాడి.. 60 డ్రోన్లను నేల కూల్చిన రష్యా సేనలు



రష్యా- ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు ఓవైపు శాంతి ప్రయత్నాలు జరుగుతోన్న తరుణంలో ఆ రెండు దేశాలు ఒకదానిపై ఒకటి దాడి చేసుకుంటున్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా వైమానిక దాడులతో విరుచుకుపడగా.. తాజాగా ప్రతీకార దాడులు చోటుచేసుకున్నాయి. మాస్కో దిశగా కీవ్ డ్రోన్లను ప్రయోగించింది. అయితే వాటిని కూల్చివేశామని మాస్కో మేయర్ సెర్గీ సోబ్యానిన్ వెల్లడించారు. మాస్కో రీజియన్‌లోని రెండు జిల్లాల్లో 11 డ్రోన్లను కూల్చివేసినట్లు మేయర్ తెలిపారు. అయితే మిగిలిన డ్రోన్లను ఏఏ ప్రాంతాల్లో కూల్చివేశారో మాత్రం వెల్లడించలేదు. రష్యా రాజధాని నగరంలోని రెండు విమానాశ్రయాల్లో విమానాల రాకపోకలపై ఆంక్షలు విధించారు. క్షతగాత్రులకు సంబంధించి ఎలాంటి వివరాలు వెల్లడి కానప్పటికీ.. ఈ దాడుల వల్ల పలు భవనాలు స్వల్పంగా దెబ్బ తిన్నాయి. తాజా ఘటన కొన్ని నెలల వ్యవధిలో రష్యాపై ఉక్రెయిన్ చేసిన అతిపెద్ద దాడి అని తెలుస్తోంది. ఇదిలాఉంటే.. రష్యా తమపై బాలిస్టిక్ క్షిపణులు, బహుళ రాకెట్లను ప్రయోగించిందని కీవ్ మేయర్ తెలిపారు. వీటిని తమ దళాలు అడ్డుకున్నాయని పేర్కొన్నారు. కీవ్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో తమకు పేలుడు శబ్దాలు వినిపించాయని అక్కడి ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధంపై మంగళవారం కీలక భేటీలు జరగనున్నాయి. అటు అమెరికా, ఇటు ఐరోపా దేశాలు ఈ సమావేశాలను నిర్వహిస్తున్నాయి. యుద్ధాన్ని ముగించేందుకు చేపట్టాల్సిన చర్యలపై సౌదీ అరేబియాలో ఉక్రెయిన్‌తో అమెరికా చర్చలకు సిద్ధంకాగా.. ఇటు అమెరికా సాయాన్ని నిలిపేసిన నేపథ్యంలో ఉక్రెయిన్‌కు అండగా నిలిచేందుకు, రష్యాను నిలువరించేందుకు ఐరోపా దేశాలు సమావేశమవుతున్నాయి.

## మస్క్‌కు మద్దతుగా కొత్త టెస్లా కారు కొంటున్నా: ట్రంప్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌ల మధ్య ఉన్న స్నేహం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ట్రంప్ ఏర్పాటుచేసిన డోజ్ శాఖ సారథిగా మస్క్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ శాఖ సలహాలతో ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాల కారణంగా అగ్రరాజ్యంలో మస్క్‌పై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇటీవల టెస్లాను బహిష్కరించాలంటూ అగ్రరాజ్యంలోని పలు ప్రాంతాల్లో నిరసనలు జరిగాయి. ఈనేపథ్యంలోనే ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మస్క్‌కు మద్దతుగా కొత్త టెస్లా కారును కొంటున్నట్లు ప్రకటించారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. 'ఎలాన్‌మస్క్ మన దేశాన్ని గొప్పగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. అందుకోసం అతను అద్భుతంగా పనిచేస్తున్నారు. కానీ, రాడికల్ లెఫ్ట్ భావజాలం కలిగిన వ్యక్తులు కావాలనే, కుట్రపూరితంగానే టెస్లాను బహిష్కరించాలని ప్రయత్నిస్తున్నారు. టెస్లా ప్రపంచంలోని గొప్ప ఆటోమేకర్, ఎలాన్ "బేబీ". మస్క్ ఒక గొప్ప అమెరికన్. తనకు మద్దతుగా నేను రేపు సరికొత్త టెస్లాను కొనుగోలు చేయనున్నా. అమెరికాను మళ్లీ గొప్పగా మార్చడంలో సహాయం చేస్తున్న అతన్ని ఎందుకు శిక్షించాలి?' అని ట్రంప్ రాసుకొచ్చారు. ఈ పోస్టుకి మస్క్ స్పందిస్తూ.. అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రభుత్వ వ్యయాలను కట్టడి చేయడం కోసం డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీని ఏర్పాటుచేశారు. దీని పగ్గాలను మస్క్‌కు అప్పగించారు. వేల మంది ఉద్యోగులను తొలగించడంతో సహా ఫెడ్ తన వ్యయాల్ని తగ్గించుకొనే ప్రయత్నాలు, సుంకాలు సహా పలు కీలక నిర్ణయాలను ట్రంప్ తీసుకుంటున్నారు.

## నటి రన్యారావు గోల్డ్ స్మగ్లింగ్ కేసు..
# సవతి తండ్రి పాత్రపై ఆరా




కన్నడ నటి రన్యారావు దుబాయ్ నుంచి అక్రమంగా బంగారం తీసుకొస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయిన సంగతి తెలిసిందే. ఆమె బంగారం తరలించే సమయంలో విమానాశ్రయంలో వీఐపీ ప్రొటోకాల్‌ను దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అంశంపై విచారణ జరపాలని కర్ణాటక ప్రభుత్వం ఆదేశించింది. బంగారాన్ని అక్రమంగా తరలించే సమయంలో భద్రతా తనిఖీలను తప్పించుకునేందుకు ఆమె సవతి తండ్రి, సీనియర్ ఐపీఎస్ అధికారి కె.రామచంద్రరావు పేరును ఉపయోగించుకున్నారనేది ప్రధాన ఆరోపణ. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాక.. ఇందులో రామచంద్రరావు పాత్ర ఏమైనా ఉందా అనే దానిపైనా దృష్టిసారించాలని కోరింది. ఇందులోభాగంగా ఈ కేసు విచారణ అధికారిగా అదనపు ప్రధాన కార్యదర్శి గౌరవ్ గుప్తాను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. తక్షణమే విచారణ ప్రారంభించి, వారం రోజుల్లో తుది నివేదిక సమర్పించాలని ఆదేశించింది.

### రన్యా స్నేహితుడి అరెస్టు..

ఇదిలాఉండగా.. రన్యా బంగారం స్మగ్లింగ్ వ్యవహారంలో ఆమె స్నేహితుడు, అట్రియా హోటల్ యజమాని మనవడు తరుణ్ రాజును డీఆర్ఐ అధికారులు అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. అతన్ని బెంగళూరులోని ప్రత్యేక ఆర్థిక నేర కోర్టులో హాజరుపరచగా.. ఐదు రోజుల కస్టడీని మంజూరు చేసింది. బంగారం అక్రమ రవాణాలో తరుణ్ పాత్ర ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైందని అధికార వర్గాలు తెలిపాయి. తాజాగా దుబాయ్ నుంచి బంగారం తరలిస్తున్న సమయంలోనూ వీరు టచ్‌లో ఉన్నట్లు గుర్తించారు. విదేశాల నుంచి బంగారం తరలించేందుకు రన్యాకు తరుణ్ సహకరించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఇటీవల దుబాయ్ నుంచి బెంగళూరుకు 14.2 కిలోల బంగారంతో వచ్చిన ఆమెను.. విమానాశ్రయం నుంచి నిష్క్రమించే చివరి నిమిషంలో అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తరచూ దుబాయ్‌కు వెళ్లడం.. వెళ్లిన ప్రతిసారీ ఒకే రకమైన దుస్తులు ధరించడంతో అనుమానం వచ్చి ఆమెపై నిఘా పెట్టగా ఈ స్మగ్లింగ్ వ్యవహారం బయటపడింది. దీంతో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కేసు వెనక ఓ ప్రముఖ రాజకీయ నాయకుడి హస్తం ఉన్నట్లు స్థానిక మీడియా సంస్థలు వెల్లడిస్తున్నాయి. నటి రన్యారావు భర్త జతిన్ హుక్కేరి ఆమెతో కలిసి పలుమార్లు దుబాయ్ వెళ్లడంతో.. అతడిని కూడా అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ట్రంప్ చర్యలను చూసి
## పొంగిపోవాల్సిందేమీ లేదు : క్రెమ్లిన్



**ఉక్రెయిన్ :** ఉక్రెయిన్‌పై ట్రంప్ కార్యవర్గం తీసుకొనే చర్యలను మరీ అంత సాను కూలంగా చూడాల్సిన అవసరం లేదని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ పేర్కొన్నారు. ఆయన మాస్కోలో జరిగిన హయ్యర్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ కార్యక్రమంలో మాట్లా డుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ సైన్యానికి స్టార్ లింక్ కమ్యూనికేషన్లు నిలిపే స్తానని మస్క్ హెచ్చరించడం, సైనిక సాయం ఆపేయాలని ట్రంప్ ఆదేశించడం వంటి విషయాలను చూసి రష్యన్లు ఉప్పొంగాల్సిందేమీ లేదన్నారు. 'ఆ చర్యలను గులాబీరంగు కళ్లద్దాల్లో చూసేందుకు ఆత్రపడొద్దు' అని అన్నారు. మనం అత్యు న్నతమైన దానిని ఆశిస్తున్నాం.. దారుణమైన పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని పెస్కో వ్ హితవు పలికారు. మన ప్రయోజనాలు కాపాడుకోవడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉండాలన్నారు. అమెరికా నిర్ణయాలతో సంబంధం లేకుండా.. ఉక్రెయిన్ యుద్ధ రంగంలో రష్యా తన లక్ష్యాలను సాధించిందని పేర్కొన్నారు. ఉక్రెయిన్‌లో ఇప్పటికే ఉన్న అమెరికా ఆయుధాలతో కొన్ని నెలలపాటు నిరంతరాయంగా పోరాడొచ్చని చెప్పారు. మంగళవారం అమెరికా మంత్రులు, అధికారుల బృందం సౌదీలో ఉక్రెయిన్ ప్రతినిధుల బృందంతో భేటీ కానున్న నేపథ్యంలో పెస్కోవ్ నుంచి ఈ హెచ్చరికలు రావడం గమనార్హం. ఉక్రెయిన్ శాంతికి సిద్ధంగా ఉందా..? రష్యాకు కొన్ని రాయితీలు ఇచ్చే విషయంలో అభిప్రాయం ఏమిటనేదీ నేటి చర్చల్లో తేలనుంది. శ్వేతసౌధంలో ట్రంప్, జెలెన్‌స్కీల మధ్య వాగ్వాదం తర్వాత జరుగుతున్న ఈ చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ చర్చల ద్వారా అమెరికా తనకు అందిస్తున్న సాయం కొనసాగుతుందన్న ఆశాభావం ఉక్రెయిన్ అధికారుల్లో ఉంది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఇప్పటికే సౌదీ రాజధాని జెడ్డాకు చేరుకొన్నారు. ఇక ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా ఇప్పటికే అక్కడున్నారు.

# కోహ్లీ @18

## ఢిల్లీ వద్దనుకుంది.. బెంగళూరు పట్టేసింది




ఐపీఎల్‌లో అత్యధిక ప్రేక్షాకదరణ పొందుతున్న ఫ్రాంచైజీల్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఒకటి. ఆర్సీబీకి భారీగా అభిమానగణం ఉందంటే అందుకు ప్రధాన కారణం విరాట్ కోహ్లీ అని నిస్సందేహంగా చెప్పొచ్చు. ఐపీఎల్ ఆరంభం నుంచే రికార్డుల మీద రికార్డులు సృష్టించిన కోహ్లీ ఆర్సీబీలో చేరి నేటికి సరిగ్గా 18 ఏళ్లు అవుతోంది. 2008 అండర్-19 ప్రపంచ కప్‌లో కోహ్లీ 235 పరుగులు చేసి భారత్ టైటిల్ సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. దీంతో విరాట్‌ను దక్కించుకోవడానికి పలు ఫ్రాంచైజీలు ఆసక్తి చూపాయి. కానీ, ఢిల్లీ డేర్‌డెవిల్స్ లోకల్ బాయ్ కోహ్లీని కాదని దిల్లీకే చెందిన బౌలర్ ప్రదీప్ స్వాంగాన్‌ను తీసుకుంది. వీరేంద్ర సెహ్వాగ్, ఏబీ డివిలియర్స్ వంటి బ్యాటర్లు జట్టులో ఉండటంతో మరో బ్యాటర్ అవసరం లేదని దిల్లీ డేర్‌డెవిల్స్ కోహ్లీని వద్దనుకుంది. దీంతో కోహ్లీని ఆర్సీబీ సొంతం చేసుకుంది. అప్పటి నుంచి ఇప్పటివరకు విరాట్ బెంగళూరు తరఫునే ఆడుతున్నాడు. ఐపీఎల్ చరిత్రలో అన్ని సీజన్లలో ఒకే జట్టుకు ఆడిన ఆటగాడిగా కోహ్లీ రికార్డు సృష్టించాడు. కెప్టెన్‌గా కోహ్లీ ఆర్సీబీకి టైటిల్ అందించలేకపోయినప్పటికీ బ్యాటర్‌గా అదరగొట్టాడు. 252 మ్యాచ్‌ల్లో 8 సెంచరీలు, 55 హాఫ్ సెంచరీల సాయంతో 8,004 పరుగులు చేశాడు. ఐపీఎల్‌లో అత్యధిక రన్స్ చేసింది కోహ్లీనే. 2013-2021 మధ్య ఆర్సీబీకి నాయకత్వం వహించిన విరాట్.. 2016 సీజన్‌లో 16 మ్యాచ్‌ల్లోనే 973 పరుగులు చేసి జట్టును ఫైనల్‌కు చేర్చాడు. 2022 సీజన్‌కు ముందు కెప్టెన్సీ బాధ్యతల నుంచి వైదొలిగి ఆటగాడిగా కొనసాగుతున్నాడు. ఐపీఎల్ 2025 సీజన్ మార్చి 22 నుంచి ప్రారంభంకానున్న సంగతి తెలిసిందే.

# ఎవరినీ బాధ పెట్టాలనే ఉద్దేశం నాకు లేదు : రోహిత్




ఛాంపియన్స్ ట్రోఫీ సెమీస్, ఫైనల్స్‌లో భారత స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్.. కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్‌ల ఆగ్రహానికి గురైన సంగతి తెలిసిందే. బౌలింగ్ వేసిన అనంతరం కుల్‌దీప్ స్టంప్స్ వెనక ఉండకపోవడం.. త్రో విసిరిన బంతిని పట్టుకోకపోవడమే ఇందుకు కారణం. ఫైనల్ మ్యాచ్‌లో 41వ ఓవర్‌లో కుల్‌దీప్ విసిరిన బంతిని పాయింట్‌లోకి నెట్టి ఓ సింగిల్‌ను తీయడానికి బ్రాస్‌వెల్ ప్రయత్నించాడు. అదే సమయంలో రవీంద్ర జడేజా మెరుపువేగంతో బంతిని అందుకొని నాన్‌స్ట్రైకర్ వైపు విసిరాడు.. అది వికెట్లకు చాలా దగ్గర నుంచి వెళ్లింది. అక్కడే ఉన్న కుల్‌దీప్ స్టంప్స్ వెనక్కి చేరి బంతిని పట్టుకోవడానికి ప్రయత్నించలేదు. ఆసీస్‌తో సెమీస్ సందర్భంగా కూడా స్టీవ్‌స్మిత్ ఆడిన బంతిని ఇలానే చేయడంతో.. కెప్టెన్ రోహిత్, విరాట్ కోహ్లీ తమదైన శైలిలో హెచ్చరించారు. ఈవిషయంపై ఫైనల్ మ్యాచ్ అనంతరం రోహిత్ మాట్లాడాడు. మైదానంలో భావోద్వేగాలు తీవ్రస్థాయిలో ఉంటాయని, అలాంటి సమయంలో అప్పుడప్పుడు తాను నియంత్రణను కోల్పోతానని రోహిత్ పేర్కొన్నాడు. 'మాకు బలమైన జట్టు ఉంది. అలాంటి నిబద్ధత కలిగిన వ్యక్తులతో కలిసి ఆడటం చాలా ఆనందంగా ఉంది. ప్రతిఒక్కరికి వారి పాత్ర, బాధ్యతలు తెలుసు. అయితే, మైదానంలో భావోద్వేగాలు ఎక్కువగా ఉంటాయి. కొన్నిసార్లు నేను కొంచెం నియంత్రణ కోల్పోతా. కానీ ఇదంతా ఆటలో భాగం. మైదానంలో అనే మాటలు ఎవరినీ బాధ పెట్టడానికి కాదు. అవి ఆటపై మనకున్న అభిరుచిని వ్యక్తపరుస్తాయి. ఏదేమైనా మా అందరి లక్ష్యం గెలుపే. దాన్ని సాధించేందుకు ఏం చేయడానికైనా మేము సిద్ధంగా ఉన్నాం. ఛాంపియన్స్ ట్రోఫీలో ఐదు మ్యాచ్‌ల్లోనూ టాస్ ఓడిపోయాం. అయినప్పటికీ టైటిల్ గెలిచాం. ఒక్క మ్యాచ్‌లోనూ ఓడిపోకుండా టోర్నీ విజేతగా నిలవడం ఎంతో సంతృప్తిని ఇచ్చింది' అని రోహిత్ వివరించాడు. న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్‌లో భారత్ విజయం సాధించడంలో కుల్‌దీప్ యాదవ్ పాత్ర కూడా ఉంది. కీలక సమయంలో డేంజరస్ బ్యాటర్లు రచిన్ రవీంద్ర (37), విలియమ్సన్ (11)ను ఔట్ చేసి కివీస్‌ను దెబ్బకొట్టాడు.



## అక్షరా.. రాహులా?

ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్సీ కోసం కేఎల్ రాహుల్, అక్షర్ పటేల్ రేసులో నిలిచారు. వీరిద్దరిలో ఎవరికి సారథ్యం అప్పగించాలో ఆ ఫ్రాంఛైజీ ఇంకా తేల్చుకోలేదు. ఆల్‌రౌండ్ నైపుణ్యం ఉన్న అక్షర్‌కే సారథ్యం లభించే అవకాశాలున్నాయని ఢిల్లీ జట్టు వర్గాలు అంటున్నాయి. ఆ జట్టు కొన్ని రోజుల్లోనే కెప్టెన్ పేరును వెల్లడించనుంది. ఈ లీగ్‌లో అక్షర్ ఇప్పటిదాకా కెప్టెన్సీ చేయలేదు.. మరోవైపు రాహుల్‌కు సారథ్యం చేసిన అనుభవం ఉంది. అతడు గతంలో పంజాబ్ కింగ్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు. వీరిద్దరిని కాదని దక్షిణాఫ్రికా స్టార్ స్టబ్స్‌కు పగ్గాలు అప్పగించే అవకాశాలు కూడా లేకపోలేదు. దిల్లీ తరఫున ఏడో సీజన్ ఆడబోతున్న అక్షర్ 150 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో 123 వికెట్లు తీసి.. 1653 పరుగులు సాధించాడు. మరోవైపు రాహుల్‌కు ఈ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం ఇదే తొలిసారి. అతడు ఇప్పటిదాకా 132 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో 4683 పరుగులు సాధించాడు.

# 'మహిళలను నిందించడం..'

## విడాకుల వార్తల వేళ ధనశ్రీ మరో పోస్ట్

టీమ్ఇండియా స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్, సతీమణి ధనశ్రీ వర్మ విడాకులు తీసుకుంటున్నట్లు కొంతకాలంగా వార్తలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. ఈక్రమంలోనే ఇటీవల చాహల్ తన స్నేహితురాలితో కలిసి ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించడం నెట్టింట చర్చకు దారితీసింది. ఈ పరిణామాల వేళ ధనశ్రీ ఇన్‌స్టాలో పెట్టిన ఓ స్టోరీ ఆసక్తికరంగా మారింది. 'మహిళలను నిందించడం ఎప్పుడూ ఫ్యాషనే' అంటూ ఆమె రాసుకొచ్చింది. దుబాయ్ వేదికగా జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌ను ప్రముఖ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, రేడియో జాకీ మహ్‌వశ్‌తో కలిసి చాహల్ వీక్షించాడు. దీన్ని ఉద్దేశించే ధనశ్రీ పోస్ట్ పెట్టారని కొంతమంది నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. అయితే, విడాకుల వార్తలకు సంబంధించి ఆమెపై చేస్తున్న ట్రోల్స్‌కే ఈవిధంగా స్పందించారని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా ఈ పోస్ట్ ఇప్పుడు వైరల్‌గా మారింది. ఇదిలా ఉండగా.. ధనశ్రీ ఇన్‌స్టా ఖాతాలో చాహల్‌తో ఉన్న ఫొటోలు మళ్లీ దర్శనమిచ్చాయి. పెళ్లి నాటి చిత్రాలతో పాటు వీరిద్దరూ కలిసి ఉన్న ఫొటోలను ఆమె అన్‌ఆర్కైవ్ చేసినట్లు తెలుస్తోంది. గతంలో వీటిని ఆమె హైడ్ చేసిన సంగతి తెలిసిందే. చాహల్, ధనశ్రీ 2020లో వివాహబంధంలోకి అడుగుపెట్టారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఈ జంట..



గతంలో పెట్టిన పోస్టులు అభిమానులను గందరగోళానికి గురిచేశాయి. సామాజిక మాధ్యమాల్లో వీరిద్దరూ ఒకరినొకరు అన్‌ఫాలో చేసుకోవడం, ధనశ్రీ తన పేరు నుంచి 'చాహల్' పదాన్ని తొలగించడంతో విడాకులపై ఊహాగానాలు మొదలయ్యాయి. ఇటీవల ముంబయిలోని బాంద్రా ఫ్యామిలీ కోర్టులో వీరి విడాకుల కేసుపై తుది విచారణ పూర్తయినట్లు కథనాలు వచ్చాయి. ధనశ్రీ భరణంగా రూ.60 కోట్లు డిమాండ్ చేసినట్లు వార్తలు వినిపించాయి. అయితే, ఈ వార్తలపై ధనశ్రీ న్యాయవాది స్పందించారు. "న్యాయపరమైన ప్రక్రియపై ఇప్పుడే మాట్లాడటం సరికాదు. ప్రస్తుతం ఈ వ్యవహారం కోర్టు పరిధిలో ఉంది. కథనాలు రాసేముందు వాస్తవాలు తెలుసుకోవాలి. తప్పుడు సమాచారం వ్యాప్తి చేయకూడదు" అని అన్నారు.

# భారత రెజ్లింగ్ సమాఖ్యపై సస్పెన్షన్ ఎత్తివేత




**ఢిల్లీ :** భారత రెజ్లింగ్ సమాఖ్యపై ఉన్న సస్పెన్షన్‌ను మంగళవారం క్రీడా మంత్రిత్వశాఖ ఎత్తివేసింది. దేశీయ టోర్నమెంట్ల నిర్వహణ, అంతర్జాతీయ టోర్నమెంట్లకు జాతీయ జట్ల ఎంపిక నిమిత్తం ఈ నిర్ణయం తీసుకుంది. లైంగిక వేధింపుల ఆరోపణలతో సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌కు వ్యతిరేకంగా సాక్షి మలిక్, బజ్‌రంగ్ పునియా, వినేశ్ ఫొగాట్ తదితర రెజ్లర్లు పోరాటం చేసిన సంగతి తెలిసిందే. దాంతో కొత్త అధ్యక్షుడి కోసం సమాఖ్యకు ఎన్నికలు నిర్వహించారు. వాటిలో బ్రిజ్‌భూషణ్ నమ్మిన బంటు సంజయ్‌సింగ్ గెలిచాడు. అనంతరం కొత్త పాలకవర్గం అత్యుత్సాహం ప్రకటించింది. డబ్ల్యూఎఫ్ఐ నియమావళికి విరుద్ధంగా అండర్-15, 20 జాతీయ ఛాంపియన్‌షిప్స్ నిర్వహిస్తామని ప్రకటించడం, పాత కార్యవర్గం (పరోక్షంగా బ్రిజ్‌భూషణ్) నియంత్రణలోనే ఇంకా సమాఖ్య ఉండటం లాంటి కారణాలతో 2023 డిసెంబర్ 24న భారత రెజ్లింగ్ సమాఖ్యపై క్రీడాశాఖ సస్పెన్షన్ విధించింది. ఇంతకాలం డబ్ల్యూఎఫ్ఐ రోజువారీ కార్యకలాపాలను అడ్‌హక్ కమిటీ చూసుకుంది. తాజాగా సస్పెన్షన్‌ను ఎత్తివేసింది. గడువు లోపు ఎన్నికలు నిర్వహించనందుకు 2023 ఆగస్టు 23న డబ్ల్యూఎఫ్ఐపై యుడబ్ల్యూడబ్ల్యూ(యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్) నిషేధం విధించిన సంగతి తెలిసిందే. ఆరు నెలల అనంతరం ఆ నిషేధాన్ని ఎత్తివేసింది.

# ఐపీఎల్ టైటిల్ సాధించినా నాకు గుర్తింపు దక్కలేదు : శ్రేయస్ అయ్యర్

టీమ్ఇండియా 2025 ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ గెలవడంలో శ్రేయస్ అయ్యర్ కీలకపాత్ర పోషించాడు. కొన్నాళ్ల ముందు వరకు అతనికి జట్టులో స్థానమే ప్రశ్నార్థకంగా ఉండేది. కానీ, అతను ఇప్పుడు జట్టులో ఎంతో విలువైన ఆటగాడుగా మారాడు. మిడిలార్డర్లో శ్రేయస్ ఎంతో కీలకమైన ఇన్నింగ్స్‌లు ఆడాడు. లీగ్ దశలో పాకిస్థాన్‌పై 56, న్యూజిలాండ్‌పై 79 పరుగులతో సత్తా చాటిన అతను.. ఆస్ట్రేలియాతో సెమీస్‌లో 45 పరుగులతో జట్టు విజయంలో ముఖ్య పాత్ర పోషించాడు. ఇప్పుడు ఫైనల్లోనూ అమూల్యమైన ఇన్నింగ్స్ (48) ఆడాడు. అయితే, 2023 ప్రపంచ కప్ తర్వాత క్రమశిక్షణారాహిత్యంతో అయ్యర్ కొన్ని నెలల భారత జట్టుకు దూరమవడంతోపాటు సెంట్రల్ కాంట్రాక్ట్ కోల్పోయాడు. తర్వాత దేశవాళీ క్రికెట్‌లో రాణించి తిరిగి టీమ్ఇండియా లోకి ఎంట్రీ ఇచ్చాడు.



గత 18 నెలల కాలంలో ఎన్నో ఎత్తుపల్లాలను చూశానని, అప్పుడు చాలా తక్కువ మంది తనతో నిరంతరం టచ్‌లో ఉండేవారని అయ్యర్ తెలిపాడు. కెప్టెన్‌గా ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను ఛాంపియన్‌గా నిలిపినా తనకు తగినంత గుర్తింపు దక్కలేదన్నాడు.

'నేను జీవితంలో అధమ దశలో ఉన్నప్పుడల్లా నాకు మెసేజ్ చేసేవాళ్లు చాలా తక్కువ. ఇందులో ప్రవీణ్ ఆమ్రే సర్, అభిషేక్ నాయర్, సాగర్ (ట్రైనర్) ఇంకా కొందరే ఉంటారు. ఆ సమయంలో నన్ను ఎంతగానో సపోర్ట్ చేసిన వారికి కృతజ్ఞతలు. ఐపీఎల్ టైటిల్ గెలవడంపైనే నా పూర్తి దృష్టి ఉండేది. భగవంతుని దయ వల్ల నేను దానిని సాధించా. ఐపీఎల్ టైటిల్ గెలిచిన తర్వాత నేను కోరుకున్న గుర్తింపు రాలేదని వ్యక్తిగతంగా భావించాను. కానీ, ఇతరులు ఏమనుకుంటున్నారనే విషయాన్ని పట్టించుకోకుండా నిజాయితీగా ఉంటూ మన పని మనం చేసుకుంటూ ముందుకువెళ్లడమనేది చాలా ముఖ్యమైనది. నేను అదే చేస్తున్నా. ఇది ఐపీఎల్‌లో విజయం సాధించిన తర్వాత ఎదురైన నిరాశా నిస్పృహలను అధిగమించడంలో సహాయపడింది' అని శ్రేయస్ అయ్యర్ వివరించాడు.

# నష్టాల నుంచి కోలుకుని ఫ్లాట్‌గా..




**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం ఫ్లాట్‌గా ముగిశాయి. అమెరికాలో నెలకొన్న మాంద్యం భయాలతో నిన్న ఆ దేశ స్టాక్ మార్కెట్లు కుదేలవ్వగా.. నేడు ఆసియా స్టాక్ మార్కెట్లపైనా ప్రతికూల ప్రభావం పడింది. దేశీయ మార్కెట్లపైనా ఆరంభం లో ఆ ప్రభావం కనిపించిన ప్పటికీ.. తర్వాత సూచీలు క్రమంగా కోలుకున్నా యి. చివరికి ఫ్లాట్‌గా ముగిశాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లలో విక్రయాలు సూచీలను పడేయగా.. ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్ షేర్లు నిలబెట్టాయి. బీఎస్ఈ సెన్సెక్స్ ఉదయం 73,743.88 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,115.17) నష్టాల్లో ప్రారంభమైంది. ఉదయమంతా దాదాపు నష్టాల్లోనే కొనసాగింది. మధ్యాహ్నం తర్వాత స్వల్ప లాభాల్లోకి వచ్చిన సూచీ 74,195.17 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 12.85 పాయింట్ల నష్టంతో 74,102.32 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 37.60 పాయింట్ల నష్టంతో 22,497.90 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 9 పైసలు కోలుకుని 87.22గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండస్ ఇండ్ బ్యాంక్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా, జొమాటో షేర్లు నష్టాల్లో ముగిశా యి. సన్‌ఫార్మా, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, మారుతీ సుజుకీ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 69 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2916 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

### ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లు కుదేలు

ప్రముఖ ప్రైవేటురంగ బ్యాంక్ ఇండస్ ఇండ్ షేర్లు నేడు భారీగా కుంగాయి. మంగళవారం ట్రేడింగ్ సెషన్‌లో ఏకంగా 27 శాతం మేర క్షీణించాయి. బ్యాంక్‌కు చెందిన డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో అవకతవకలు ఉన్నట్లు అంతర్గత సమీక్షలో తేలడం ఇందుక్కారణం. దీంతో బ్యాంక్ నికర విలువపై దాదాపు 2.35 శాతం ప్రతికూల ప్రభావం పడనున్నట్లు బ్యాంక్ అంచనా వేసింది. అంటే ఏకంగా రూ.1,500 కోట్ల నష్టానికి సమానం. ఈ ప్రకటన షేర్లపై ప్రతికూల ప్రభావం చూపింది. ప్రస్తుత సీఈఓ సుమంత్ కత్పలియా పదవీకాలాన్ని మూడేళ్లు కాకుండా ఒక సంవత్సరం పాటే పొడిగించేందుకు ఆర్‌బీఐ అనుమతించడంతో సోమవారం బీఎస్ఈలో 3.86 శాతం నష్టంతో రూ.900.70 వద్ద ముగిశాయి. బ్యాంక్ నుంచి తాజా ప్రకటన వెలువడడంతో మంగళవారం మరో 27 శాతం క్షీణించి రూ.655.95కి చేరింది.

# రూ.349 లక్షల కోట్ల సంపద ఆవిరి

## అమెరికా మార్కెట్లు గజగజ



అమెరికా స్టాక్ మార్కెట్లు దాదాపు 20 రోజుల వ్యవధిలోనే భారీగా పతనం అయ్యాయి. స్టాక్స్‌లోని మదుపర్ల సంపద 4 ట్రిలియన్ డాలర్ల (రూ.349 లక్షల కోట్లు) మేరకు ఆవిరైపోయింది. ఇది యూకే, ఫ్రాన్స్ వంటి దేశాల జీడీపీ కంటే ఎక్కువ కావడం గమనార్హం. ముఖ్యంగా అమెరికా ఫెడరల్ గవర్నమెంట్ షట్‌డౌన్ భయాలు సూచీలను వెంటాడుతున్నాయి. దీనికి ట్రంప్ అస్థిర విధానాలు తోడయ్యాయి. ఎస్అండ్‌పీ 500 సూచీ ఫిబ్రవరి 19వ తేదీన నమోదు చేసిన ఆల్‌టైమ్ హై నుంచి ఇప్పటికి 8 శాతానికిపైగా విలువ కోల్పోయింది. నాస్‌డాక్ కాంపోజిట్ డిసెంబర్‌లో నమోదుచేసిన అత్యధిక విలువ నుంచి 10శాతం పతనమైంది. ఇక ఒక్క సోమవారమే 1.7 ట్రిలియన్ డాలర్ల సంపద కరిగిపోయింది. 2022 సెప్టెంబర్ తర్వాత ఈ స్థాయిలో పతనం కావడం ఇదే తొలిసారి. ఇక మస్క్ నేతృత్వంలోని టెస్లా షేర్ ధర 15శాతం పతనం కావడం గమనార్హం. డిసెంబర్ 17 నుంచి ఈ సంస్థ షేరు విలువ 50శాతం ఆవిరైంది. నాడు అత్యధికంగా 479.86 డాలర్లు ఉండగా.. నేడు అది 222.15 డాలర్లకు చేరింది.

### సూచీలు ఎందుకు కుంగుతున్నాయి..?

వివిధ కారణాలు కలిసి ఓ ప్యాకేజీలా మార్కెట్లను దెబ్బతీస్తున్నాయి. ముఖ్యంగా వాణిజ్య విధానాల్లో హఠాత్తుగా వస్తున్న మార్పులు, ఆర్థిక మాంద్యం భయాలు, స్టాక్స్ అధిక విలువలు వంటివి కారణమవుతున్నాయని లాజర్డ్ సీఈవో పీటర్ ఓర్స్‌జాగ్ వెల్లడించారు. ముఖ్యంగా ప్రధాన వాణిజ్య భాగస్వాములైన కెనడా, మెక్సికో, ఐరోపాతో వాణిజ్య యుద్ధాల వల్ల చాలా కంపెనీలు తమ వ్యాపార వ్యూహాలను పునఃపరిశీలిస్తున్నాయన్నారు. అమెరికాలోని భారీ సంపన్నులపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటోంది. అక్కడి మార్కెట్లలో 50 శాతం విలువైన సంపద 1శాతం మంది వద్ద ఉంటుంది. ఇక 37శాతం విలువైన సంపద 10శాతం మంది వద్ద ఉంటుంది. 12శాతం వాటా 40శాతం మంది వద్ద కేంద్రీకృతమైంది. మిగిలిన 1శాతం వాటా 50శాతం మంది ప్రజల చేతిలో ఉందని ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ సెయింట్ లూయిస్ డేటా పేర్కొంది.




# 30 వేల మంది పైలట్లు అవసరం : రామ్మోహన్ నాయుడు

భారత్‌లో పౌర విమానయాన రంగం వేగంగా విస్తరిస్తోంది. ప్రయాణికుల సంఖ్య ఏటికేడు పెరుగుతుండడంతో అందుకు అనుగుణంగా విమానాలను సైతం ఆయా సంస్థలు సిద్ధం చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో రాబోయే రోజుల్లో పైలట్లు కూడా పెద్ద సంఖ్యలో అవసరమవుతారని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. రాబోయే 15-20 ఏళ్లలో సుమారు 30వేల మంది పైలట్లు అవసరం పడతారని పేర్కొన్నారు. 200 శిక్షణ విమానాల కొనుగోలుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ మేరకు ఆయన మాట్లాడారు. దేశీయంగా 800కు పైగా విమానాలు సేవలందిస్తున్నాయని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ప్రస్తుతం 6,7 వేల మంది పైలట్లు పనిచేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే వివిధ కంపెనీలు 1700కు పైగా విమానాలకు ఆర్డర్ పెట్టాయని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో అవి సేవలందించబోతున్నాయన్నారు. దీంతో రాబోయే 15-20 ఏళ్లలో 30 వేల మంది పైలట్లు అవసరమని చెప్పారు.

# రికార్డులు సృష్టిస్తున్న ఛావా

## బాహుబలి-2 కలెక్షన్లను అధిగమించి వసూళ్లు




విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో తెరకక్కిన 'ఛావా'రికార్డులు సృష్టిస్తోంది. ఇప్పటికే బీటౌన్‌లో ఎన్నో రికార్డులు తన ఖాతాలో వేసుకోగా.. తాజాగా మరో మైలురాయిని చేరుకుంది. సినీ ఇండస్ట్రీలో చరిత్ర సృష్టించిన 'బాహుబలి 2' రికార్డును అధిగమించింది. దీంతో విక్కీ అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన 'బాహుబలి 2' అంతర్జాతీయ స్థాయిలో భారతీయ సినిమాకు గుర్తింపుతెచ్చింది. దేశవ్యాప్తంగానూ విడుదలైన అన్ని ప్రాంతాల్లో భారీ వసూళ్ళ సొంతం చేసుకుంది. హిందీలో ఈ చిత్రం రూ.510 కోట్లు వసూళ్లు రాబట్టింది. ఇప్పుడీ కలెక్షన్లను 'ఛావా' అధిగమించింది. ఫిబ్రవరి 14న విడుదలైన 'ఛావా' ఇప్పటివరకూ బీ టౌన్‌లో రూ.516 కోట్లు వసూళ్లు చేసింది. దీంతో 25 రోజుల్లోనే బాలీవుడ్‌లో 'బాహుబలి 2' రికార్డును అధిగమించి చరిత్ర సృష్టించింది. అంతేకాదు హిందీ చలనచిత్ర చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన ఆరో సినిమాగా 'ఛావా' నిలిచింది. మరోవైపు ఈ సినిమా ఓటీటీ విడుదల గురించి సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. దీని డిజిటల్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. థియేటర్‌లో సూపర్‌హిట్‌గా నిలిచిన ఈ చిత్రం ఏప్రిల్ 11 నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు వార్తలు వస్తున్నాయి . త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన రానుందంటూ పోస్ట్‌లు షేర్ అవుతున్నాయి. ఈ చిత్రం ఓటీటీ విడుదలయ్యాక అక్కడ కూడా రికార్డులు నెలకొల్పడం ఖాయంగా కనిపిస్తోంది. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో శంభాజీ మహారాజ్‌గా విక్కీ కౌశల్ ఆయన భార్య యేసుబాయి భోంస్లే పాత్రలో రష్మిక జీవించేశారు.







# 'గేమ్ ఛేంజర్'కు 25 రోజులు పనిచేశా..

## రెండు నిమిషాలు కూడా లేను : ప్రియదర్శి

శంకర్ దర్శకత్వంలో నటించాలన్న కోరికతోనే 'గేమ్ ఛేంజర్' చేశానని సినీ నటుడు ప్రియదర్శి అన్నారు. రామ్‌చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన పొలిటికల్ యాక్షన్ మూవీ ఇది. నాని నిర్మాత రామ్ జగదీశ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కోర్ట్: స్టేట్ వర్సెస్ ఎ నోబడీ'. ప్రియదర్శి, శివాజీ, హర్ష్ రోషన్, శ్రీదేవి, సాయికుమార్, రోహిణి, హర్ష వర్ధన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. మార్చి 14న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. 'కోర్ట్' ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ప్రియదర్శి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. "గేమ్ ఛేంజర్' చిత్రాన్ని 'బలగం' కంటే ముందు ఒప్పుకొన్నాను. ఆ సమయంలో హీరో స్నేహితుడి పాత్రలు చేస్తూ ఉండేవాడిని. ఆ మూవీని ఎప్పుడు ప్రకటించారో, ఎప్పుడు పూర్తయిందో, చిత్రకరణ ఎలా జరిగిందో అందరికీ తెలుసు. అందులో నేను చాలా సీన్స్ చేశా. అవన్నీ ఎడిటింగ్‌లో పోయాయి. నా పాత్ర చిన్నదని నాకు ముందే తెలుసు. నేను 25 రోజులు పనిచేశా. 2 నిమిషాలు కూడా కనిపించను. శంకర్‌గారు, రామ్‌చరణ్ అన్న, తిరుగారితో పనిచేయాలని నాకు ఎప్పటి నుంచో ఉంది. శంకర్ నాతో వ్యక్తిగతంగా సినిమా చేయకపోవచ్చు. కానీ, నాకైతే ఆయనతో పనిచేసే అవకాశం లభించింది కదా. ఆ ఆనందం చాలు" "చిరంజీవిగారితో పనిచేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. కానీ, కుదరడం లేదు. 'ఆచార్య'లో ఓ పాత్ర కోసం నన్ను అడిగారు. ఆ తర్వాత స్క్రిప్ట్‌లో నుంచి ఆ పాత్రను తీసేయడంతో వద్దన్నారు. బాబీ చేసిన 'వాల్తేరు వీరయ్య'లోనూ ఏదో పాత్ర క్యారెక్టర్ ఇవ్వమని అడిగా. కనీసం అలా కనిపించి వెళ్లిపోతానని బతిమిలాడా. 'నువ్వు చేసే పాత్ర ఇందులో లేదు దర్శి' అని బాబీ అన్నారు. మెహర్ రమేశ్ 'భోళా శంకర్'లోనూ అవకాశం ఇవ్వమని కోరా. అప్పుడూ కుదరలేదు. ఇక అనిల్ రావిపూడి సినిమా కోసం అడుగుతా" అని ప్రియదర్శి చెప్పుకొచ్చారు.

# చిరంజీవి అలా పిలిచేసరికి ఆశ్చర్యపోయా : నాని



హీరోగానే కాకుండా నిర్మాతగానూ తన వైవిధ్యాన్ని చాటుకుంటున్నారు నాని. ఆయన నిర్మాతగా వ్యవహరించిన చిత్రం 'కోర్ట్: స్టేట్ వర్సెస్ ఎ నోబడీ'. మార్చి 14న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇటీవల చిరంజీవితో జరిగిన ఓ సరదా సంభాషణను పంచుకున్నారు. "నాగచైతన్య పెళ్లిలో నేను కారు దిగి మండపంలోకి వెళ్తుంటే చిరంజీవి ఎదురువచ్చారు. ప్రొడ్యూసర్ గారు బాగున్నారా అని పలకరించారు. నన్ను కాదనుకొని వెనక అశ్వినీదత్ లాంటి గొప్పవాళ్లు ఎవరైనా వస్తున్నారేమోనని చూశాను. ఎవరూ లేరు. 'మిమ్మల్నే ప్రొడ్యూసర్ గారు' అని చిరంజీవి నాకు హగ్ ఇచ్చారు. ఆయన నన్ను అలా పిలవడంతో ఆశ్యర్చపోయాను" అని చెప్పారు. ఇక ఇదే ఇంటర్వ్యూలో ప్రియదర్శి మాట్లాడుతూ.. చిరంజీవి 'కోర్ట్' పోస్టర్ చూసి తనను అభినందించినట్లు చెప్పారు. "నువ్వు సూట్ వేసుకున్న పోస్టర్ చూశాను చాలా బాగున్నావు. నాని నిర్మాతగా వ్యవహరిస్తున్నాడు కదా..హిట్ అవుతుందిలే" అని చిరంజీవి చెప్పారని ప్రియదర్శి తెలిపారు. ఆయన అంత కాన్ఫిడెంట్‌గా చెప్పడంతో తనకు సంతోషమేసిందన్నారు. ప్రియదర్శి ప్రధానపాత్రలో తెరకెక్కిన చిత్రం 'కోర్ట్: స్టేట్ వర్సెస్ ఎ నోబడీ'. రామ్‌జగదీశ్ దర్శకుడు. స్టేట్ ఆఫ్ తమిళనాడు వర్సెస్ రాధాకృష్ణ కేసు ఈ చిత్రం కథకు స్ఫూర్తి అని ప్రియదర్శి తాజాగా వెల్లడించారు.

# రంభ రీ ఎంట్రీ..

## క్లారిటీ ఇచ్చిన నిర్మాత

1990ల్లో స్టార్ హీరోల సరసన నటించి మెప్పించారు నటి రంభ. ఈ నటి మరోసారి వెండి తెరపై సందడి చేయనుందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. తాజాగా తమిళ నిర్మాత ఓ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ వార్తలపై స్పందించారు. ఆమె రీ ఎంట్రీ ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఫిల్మ్ ఫెస్టివల్‌లో తమిళ నిర్మాత కలైపులి ఎస్.థాను ఈ నటి రీ ఎంట్రీ గురించి మాట్లాడారు. "రంభ ఆర్థికంగా సెటిల్ అయ్యారు. తన భర్త కూడా పెద్ద వ్యాపారవేత్త. ఆయన ఇటీవల నన్ను కలిసినప్పుడు రంభకు మంచి సినిమాలో అవకాశం ఇవ్వమని కోరారు. అలాంటి ప్రాజెక్ట్ ఏమైనా ఉంటే కచ్చితంగా ఆమెను సంప్రదిస్తానని అతడికి హామీ ఇచ్చాను" అని చెప్పారు. దీంతో త్వరలోనే ఈ నటి రీ ఎంట్రీ ఖాయమని అభిమానులు భావిస్తున్నారు. రాజేంద్ర ప్రసాద్ హీరోగా నటించిన 'ఆ ఒక్కటి అడక్కు' సినిమాతో టాలీవుడ్‌లో గుర్తింపుతెచ్చుకున్నారు రంభ. ఆ తర్వాత వరుసగా స్టార్ హీరోల సినిమాల్లో అవకాశాలు సొంతం చేసుకున్నారు. అంతేకాదు.. దేశముదురు, యమదొంగ సినిమాల్లో స్పెషల్ సాంగ్స్‌లో అదరగొట్టారు. ఈ పాటలు ఇప్పటికీ ట్రెండింగ్‌లో ఉన్నాయి. 2010లో కెనడాలో స్థిరపడిన ఇంద్రకుమార్‌ను వివాహం చేసుకున్నారు. దీంతో కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉ ంటున్నారు. నటనకు దూరంగా ఉంటున్నప్పటికీ పలు టీవీ డ్యాన్స్ షోలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తున్నారు. చివరిసారి 2008లో వెండితెరపై కనిపించారు రంభ.



# ఒడిశాకు ప్రియాంక చోప్రా..

రాజమౌళి దర్శకత్వంలో స్టార్ హీరో మహేశ్ బాబు నటిస్తున్న సినిమా అప్‌డేట్స్ కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇందులో ప్రియాంక చోప్రా కీలకపాత్రలో కనిపించనున్న విషయం తెలిసిందే. ఈ నటి పంచుకుంటున్న తన అప్‌డేట్స్ క్షణాల్లో వైరల్ అవుతున్నాయి. దీంతో హ్యాష్‌ట్యాగ్ మరోసారి ట్రెండింగ్‌లోకి వచ్చేసింది. తాజాగా ప్రియాంక తన ఇన్‌స్టాలో కొన్ని ఫొటోలు, వీడియో పంచుకున్నారు. ఆ వీడియో చూస్తే, ఆమె ఒడిశా వెళ్లినట్లు తెలుస్తోంది. దానితో పాటు విమానం నుంచి చూస్తున్న ఓ స్టైలిష్ ఫొటోను కూడా ప్రియాంక షేర్ చేశారు. షూటింగ్ కోసమే ఆమె అక్కడకు వెళ్లినట్లు సమాచారం. మార్చి 10న విమానాశ్రయంలోని సిబ్బందితో ప్రియాంక దిగిన ఫొటో కూడా నెట్టింట వైరలైన విషయం తెలిసిందే. లార్జ్ దేన్ లైఫ్ కథలకు రాజమౌళి పెట్టింది పేరు. జక్కన్న ఏం చేసినా దాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, భారీ హంగులు అద్ది ప్రేక్షకులకు అందిస్తారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మరో వార్త కూడా మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సినిమా లో రాజమౌళి కాశీ నగరాన్ని చూపనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఎప్పుడూ రద్దీగా ఉండే కాశీలో షూటింగ్ నిర్వహించడం కష్టం. దీంతో నిజంగా కాశీని తలపించేలా అద్భుతమైన సెట్ వేయనున్నారట. ఈ సినిమా లోని కీలక భాగం కాశీ పట్టణానికి సంబంధం ఉంటుందని అందుకే రాజమౌళి ఈ సెట్ వేయనున్నారని సమాచారం. అడవులు, నదులు, ఆధ్యాత్మిక నగరాలు.. ఇలా విభిన్న ప్రకృతి దృశ్యాలతో ప్రేక్షకులను ఎప్పటికీ మర్చిపోలేని సినిమాటిక్ అనుభూతిని అందించేందుకు రాజమౌళి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ సినిమాను లీక్స్ బెడద వెంటాడుతోంది. భారీ బడ్జెట్‌తో రూపొందిస్తున్న ఈ సినిమా షూటింగ్ నుంచి ఇటీవల ఓ వీడియో నెట్టింట లీకవ్వగా అప్రమత్తమైన చిత్ర బృందం వెంటనే చర్యలకు దిగింది. నెటిజన్లు షేర్ చేసిన వీడియోలను తొలగించే పనిలో పడింది.



# ఆ సాంగ్ విషయంలో టెన్షన్..

## 'నో స్లీప్ మారథాన్' : జాన్వీ కపూర్

ఓ పాట చిత్రీకరణ విషయంలో తాను టెన్షన్ పడ్డానని జాన్వీ కపూర్ వెల్లడించారు. ఒకేసారి రెండు సినిమాల షూటింగ్ వల్ల మూడు రోజులు నిద్ర లేదని చెప్పారు. రాజ్‌కుమార్ రావ్, జాన్వీ ప్రధాన పాత్రల్లో రూపొందిన హారర్ కామెడీ మూవీ 'రూహీ'. 2021 మార్చి 11న విడుదలైంది. సినిమా విడుదలై నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా జాన్వీ ఆ సినిమాలోని 'నదియో పార్' సాంగ్ షూటింగ్‌ను గుర్తుచేసుకున్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. "నాలోని డ్యాన్సర్‌ని పరిచయం చేసే అవకాశం తొలిసారిగా 'రూహీ'తో వచ్చింది. నటిగా ఆ సమయానికి నేను చిన్నదానిని. 'నదియో పార్' విషయంలో అప్పుడు టెన్షన్ పడ్డా. భారీ లైట్ల వెలుగులో కళ్లు తెరిచి ఉండలేకపోయేదానిని. ఓవైపు 'గుడ్‌లక్ జెర్రీ' షూటింగ్‌లో పాల్గొంటూనే 'నదియో పార్' రిహార్సల్స్ చేసేదాన్ని. పటియాలాలో (పంజాబ్) ఓ రాత్రంతా 'గుడ్‌లక్ జెర్రీ' షూట్‌లో పాల్గొన్నా. పేకప్ తర్వాత ప్రయాణం చేసి, 'నదియో పార్' చిత్రీకరణలో పాల్గొన్నా. నిద్ర లేకపోయినా 7 గంటల్లో ఆ సాంగ్ కంప్లీట్ చేయగలిగా. మళ్లీ వెంటనే 'గుడ్‌లక్ జెర్రీ' షూటింగ్‌లో జాయిన్ అయ్యా. అలా మూడు రోజుల పాటు 'నో స్లీప్ మారథాన్' (నిద్రలేకపోవడం) అయినా కెమెరా ముందు ఉండడం ఉత్సాహమే" అని పేర్కొన్నారు. హెయిర్ మేకప్‌సహా ఆ సాంగ్ విషయంలో అన్నింటిని కత్రినాకైఫ్ స్ఫూర్తితోనే చేశామని తెలిపారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com